# ఇందిరమ్మ ఇళ్ల కమిటీల సమావేశం
## -కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కావాలి చంద్రశేఖర్

**షాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
చేవెళ్ల మండల కేంద్రంలోగల కె.జి.ఆర్ ఫంక్షన్ హాల్లో ఇందిరమ్మ కమిటీల నియోజకవర్గస్థాయి సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కావాలి చంద్రశేఖర్ తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల నియోజకవర్గ శాసనసభ్యులు కాలె యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ శ్రీ ఎల్గంటి మధుసూధన్‌రెడ్డి, నియోజకవర్గస్థాయి అధికారులు పాల్గొనడం జరుగుతుందని, షాబాద్ మండలంలోని అన్ని గ్రామాల ఇందిరమ్మ కమిటీ సభ్యులు, షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
## -కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి

**కొడంగల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమపథకాలను అమలుచేస్తున్నారని కాంగ్రెస్‌నియోజక వర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కడా కారా ్యలయంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 70మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లను అందించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి గాంధీనగర్ వరకు రోడ్డు విస్తరణ పనులకు తిరుపతిరెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి,గ్రంథాలయ చైర్మన్ రాజేష్‌రెడ్డి,మార్కెట్‌కమిటీచైర్మన్ అంబయ్యగౌడ్, మాజీ మున్సిపల్‌చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి,పార్టీ మండల అధ్యక్షులు నందారం ప్రశాంత్,కృష్ణంరాజు, కొడంగల్ నయ్యూం,దాము,ఎస్ఎం.గౌసన్, సోమశేఖర్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి వైపు దూసుకెళుతున్న పల్లెలు



రహదారి ప నుల ు ప్రారంభిస్తున్న నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్చార్జి తిరుపతిరెడ్డి

**బొంరాస్‌పేట్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వహయాంలో ప్రగతివైపు పల్లెలు దూసుకెళుతున్నాయని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జీ తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో మండలంలో ఆయాగ్రామాలలో ఆశాఖ ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.40 కోట్లతో నిర్మించ నున్న రహదారి ప నులకు స్థానిక నేతలతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతప్రభుత్వహయాంలో పదేళ్లు నియోజక వర్గంలో ప్రగతి పడకేసిందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని పల్లెలు ప్రగతివైపు దూసుకెళుతున్నాయని ఆయన తెలిపారు. అన్నిరంగాలలో రాష్ట్రంలోనే కొడంగల్ నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా సిఎం ప్రత్యేక కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్యనాయకులు రాజేష్‌రెడ్డి, నర్సింలుగౌడ్, జయకృష్ణ, రామచంద్రారెడ్డి, నరసింహనాయుడు, బలిజ మల్లేష్, వెంకట్ రాములుగౌడ్, బుక్క కలీం, చినబాబ, కుమ్మరి కాశప్ప ఉన్నారు.

# చైల్డ్‌కేర్ వసతిగృహాన్ని తనిఖీచేసిన అదనపుకలెక్టర్



చైల్డ్‌కేర్ వసతిగృహాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపుకలెక్టర్ లింగ్యానాయక్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
జిల్లాలో సెమీ అర్బన్ జిల్లా నివేదిక కమిటీ ఆధ్వర్యంలో జిల్లాకలెక్టర్ ఆదేశాలమేరకు వికారాబాద్ మండలం ధన్నారం స్వామి వివేకానంద స్కూల్ అఫ్ ఎక్సలెన్స్‌లోని చైల్డ్‌కేర్ వసతిగృహాన్ని జిల్లా అదనపుకలెక్టర్ లింగ్యానాయక్ బుధవారం తనిఖీచేశారు. ఇంచార్జి జిల్లా శిశుసంక్షేమ అధికారి జయసుధతో సహా స్వామివివేకానంద స్కూల్ అఫ్ ఎక్సలెన్స్ వసతిగృహాన్ని సందర్శించి రికార్డ్స్‌ను పరిశీలించారు. డార్మెంటరీ, వాష్‌రూంల ు పరిశీలించి, సెక్యూరిటీ, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారా,లేదా, మె నూ ప్రకారము భోజనం పెడుతున్నారా,లేదా అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలకు అ నుగుణంగా మెనూ ప్రకారము వారికి ఆహారం అందించాలని, ప్రతినెల పిల్లలకు హెల్త్ చెకప్ చేయించాలని, రికార్డ్స్ మెయింటెనెన్స్ చేయాలని సంబంధిత వార్డెన్‌లను ఆదేశించారు. కార్యక్రమంలో సిడబ్ల్యుసి మెంబర్లు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం
## -చేవెళ్ల వైస్ ఎంపిపి శివప్రసాద్



సిసిరోడ్డు పనులు ప్రారంభిస్తున్న చేవెళ్ల వైస్‌ఎంపిపి శివప్రసాద్, గ్రామ మాజీసర్పంచ్ జంగీర్

**చేవెళ్ల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతోనే ఉరెళ్ల గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని, ఉరెళ్లగ్రామ మాజీసర్పంచ్ జంగీర్ సహకారంతో గ్రామంలో నెలకొన్న సమస్యలను అంచెలంచెలుగా పరిష్కారం చేస్తామని చేవెళ్ల వైస్ ఎంపిపి శివప్రసాద్ అన్నారు. బుధవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని ఉరెళ్ల గ్రామంలో ఐదులక్షలతో నిర్మించే సిసిరోడ్డు పనులకు శంఖుస్థాపన చేశారు. ఈసందర్భంగా చేవెళ్ల వైస్ ఎంపిపి శివప్రసాద్ మాట్లాడుతూ ఉరెళ్ల గ్రామ అభివృద్ధికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఎన్నినిధులైనా మంజూరుచేస్తామని హామీనిచ్చారన్నారు. గ్రామంలోని కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సిసిరోడ్డు పనులకు నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డుమెంబర్‌లు బండ్ల రవి, చాన్ పాషా, చాకలి రవి, బ్యాగరి యాదయ్య, సంజీవయ్య, ఎర్రుల రాజు, బాయికాడి యాదయ్య, కరికే శ్రీపాల్, గంగారం అశోక్ గ్రామస్థులు పాల్గొన్నారు.

# గిన్నిస్‌బుక్‌లో ఘట్‌కేసర్ విద్యార్థినికి చోటు




గిన్నిస్ ప్రశంసాపత్రం అందుకొంటున్న ప్రసస్థ

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ గాంధీనగర్‌కు చెందిన దొడ్డిగర్ల కన్నయ్య కూతురు ప్రసస్థకు గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటుదక్కింది. ఘట్‌కేసర్ మున్సిపల్ అవుషాపూర్‌లోని మెరిట్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న దొడ్డిగర్ల ప్రసస్థ అరుదైన ఘనత సాధించింది. 2024 డిసెంబర్ 1న మిస్టర్ అగస్టిన్, దండింగి వేణుగోపాల్, హలెల్ సంగీత పాఠశాల ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేదికగా దేశవ్యాప్తంగా 1046 మంది విద్యార్థులతో గంట వ్యవధిలో కీబోర్డు వాయించి, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసినందుకు ఈగౌరవం వరించింది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆసంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా ప్రసస్థ గిన్నిస్ రికార్డ్ ధృవపత్రాన్ని అందుకున్నారు. ఘట్‌కేసర్ బేతనీయ ప్రార్థణ మందిరం ఫాస్టర్ యేసు రమేశ్ ఆధ్వర్యంలో సంఘస్థురాలు అగస్టిన్ దండిగి హలెల్ మ్యూజిక్ స్కూల్ ద్వారా కీబోర్డులో ప్రసస్థ ప్రావీణ్యత పొంది ప్రపంచ గిన్నిస్ రికార్డులో స్థానం సంపాదించింది.

# పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక
## -వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**పరిగి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
వికారాబాద్ జిల్లాలో పేదలకు కేటాయించే ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తామని జిల్లాకలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. బుధవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డితో కలిసి జిల్లాకలెక్టర్ పరిగి నియోజకవర్గంలో పర్యటించారు. పరిగి నియోజకవర్గ సమస్యలను, దశలవారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జిల్లాకలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. బుధవారం, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి,జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ కలిసి పరిగి నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. పరిగిమండల తహసీల్దారు కార్యాలయంలో ప్రజలనుండి సమస్యలను, వినతులను స్వీకరించారు. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, దశలవారీగా పరిష్కరించేందుకు శాసనసభ్యులు రామ్మోహన్‌రెడ్డి సహకారం తీసుకుంటామన్నారు. తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఉన్న 100 సంవత్సరాల పైబడిన పురాతన భవనాలను పరిశీలించి, వాటిస్థానంలో నూతనభవనాల నిర్మాణానికి లేదా ప్రభుత్వ ఆస్తుల సక్రమ వినియోగానికి చర్యలు తీసుకునేందుకు, పూర్తి వివరాలతో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన తర్వాత ప్రభుత్వ ఆదేశాలమేరకు తగుచర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అనంతరం బిసి వసతిగృహాన్ని పరిశీలించి, బియ్యం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు మెనూప్రకారం భోజనం అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో ఉన్న మహిళా శక్తి క్యాంటీన్‌ను, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ మోడల్‌హౌస్‌ను సందర్శించారు. బేస్మెంట్ నిర్మాణానికై లక్షరూపాయల చెక్కును మాలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిగి ఎఎంసి చైర్మెన్ పరుశురామ్‌రెడ్డి, తహసీల్దార్ ఆనందరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, ప్రసాద్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తది తరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్

# ప్రభుత్వ బడులపై సర్కారు శీతకన్ను..
### -అభివృద్ధికి నోచుకోని సర్కారు బడులు
### -తరగతిగది పెచ్చులూడి విద్యార్థినికి గాయాలు
### -తృటిలో తప్పిన ప్రమాదం



పాఠశాల గదులను పరిశీలిస్తున్న డిఈఓ రేణుకాదేవి

**ధారూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
సర్కారు బడి అంటే అందరికీ చిన్న చూపే. ప్రస్తుత సర్కారు సైతం ప్రభుత్వ బడులపై శీతకన్ను ప్రదర్శిస్తోంది. అసెంబ్లీ స్పీకర్ సొంత నియోజకవర్గం అయినప్పటికి నియోజకవర్గంలోని పాఠశాలలు అభివృద్ధిలో ఆమడదూరంలో ఉన్నాయి. వేదికలు ఎక్కి మైకు దొరికితేచాలు..మా ప్రభుత్వం ఇది చేస్తుంది..అది చేస్తుందని బడాయిలు మాట్లాడుతారు. ఏ ప్రభుత్వం వచ్చినా సర్కారు బడుల్లో వసతుల తీరు మారడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ప్రభుత్వ బడుల తీరు తయారైంది. గత ప్రభుత్వంపై విమర్శలు చేయడంతప్ప, ప్రభుత్వబడుల బలోపేతానికి ప్రజాప్రతినిధులు కృషి చేయడంలేదనే విమర్శలు ప్రజలనుంచి వినిపిస్తున్నాయి. దీంతో శిథిలావస్థకు చేరుకున్న తరగతి గదుల్లోనే విద్యాబోధన జరుపుతున్నారు. పాఠశాలతరగతిగది పెచ్చులూడి కింద పడటంతో ఆరేళ్ళ విద్యార్థినికి తీవ్రగాయాలై తృటిలో పెనుప్రమాదం తప్పింది. ఈసంఘటన వికారాబాద్ జిల్లా ధారూరుమండలపరిధిలోని మున్నూరుసోమారంగ్రామం ప్రాథమిక ఉన్నతపాఠశాలలో బుధవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకుసంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మున్నూరు సోమారం గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 82 మంది విద్యార్థులు, 6మంది ఉపాధ్యాయులు ఉన్నారు. రోజు మాదిరిగానే బుధవారం పాఠశాలకు విద్యార్థులు వచ్చారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధిస్తున్న తరుణంలో ఉన్నట్టుండి తరగతిగది పైకప్పు పెచ్చులు ఊడి కింద పడ్డాయి. దీంతో తరగతి గదిలో ఉన్న ఆరేళ్ళ విద్యార్థిని శిరీష పై పడడంతో తల, చెవి, కాళ్లకు గాయాలయ్యాయి. వెంటనే ఉపాధ్యాయులు వికారాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న జిల్లా విద్యాధికారి రేణుకాదేవి పాఠశాలను తనిఖీచేసి పరిశీలించారు. పాఠశాలలోని పరిసరాలు పరిశీలించి ప్రమాదకరంగా ఇంకా ఏమైనా తరగతి గదులు ఉన్నాయా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థకు చేరిన రెండు తరగతి గదుల్లో విద్యార్థులను కూర్చోబెట్టరాదని ఉపాధ్యాయులను డిఈఓ ఆదేశించారు. ఈవిషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయిస్తానని డిఈఓ తెలిపారు. అనంతరం డిఈవో రేణుకాదేవి వికారాబాద్ పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని శిరీషను పరామర్శించారు.

**ఆదర్శపాఠశాలగా ఎంపికైనా, వసతులుమాత్రం శూన్యం..**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలపథకం కింద మున్నూరుసోమారం ప్రాథమికోన్నత పాఠశాలను ఎంపికచేశారు. దీంతోపాఠశాలలో తూతూమంత్రంగా మరమ్మతులుచేపట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు. పాఠశాలభవనానికి మరమ్మతులు చేపట్టినట్లు పాఠశాల ఉపాధ్యాయులు సైతం చెబుతున్నారు. మరమ్మతుల పేరుతో తూతూమంత్రంగా పనులు చేపట్టడం వల్లే ఈ ఘటన జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులుస్పందించి నాణ్యతగా పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా శిథిలావస్థకు చేరుకున్న తరగతి గదుల పునర్నిర్మాణం కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతున్నారు.

# సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి
## -అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**పూడూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పేర్కొన్నారు. బుధవారం పూడూరు మండలం పరిధిలోని గొంగుపల్లి గ్రామంలో చౌకధరల దుకాణాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి నాణ్యతగల బియ్యం అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. డీలర్లు ప్రతి నెల రేషన్‌కార్డుదారులకు సకాలంలో సన్నబియ్యాన్ని అందజేయాలని ఆదేశించారు. సన్నబియ్యంపంపిణీ కార్యక్రమంపై లబ్దిదారులను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, డిసిఎస్‌ఓ మోహన్‌బాబు పాల్గొన్నారు.




సన్నబియ్యంపంపిణీని పరిశీలిస్తున్న అదనపుకలెక్టర్ లింగ్యానాయక్

### ప్లాస్టిక్ బియ్యం సరఫరా అసత్య ప్రచారం..
#### -అసత్య ప్రచారాలు చేస్తే క్రిమినల్ కేసులు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
రేషన్‌షాపుల్లో పంపిణీచేసే సన్నబియ్యంలో ప్లాస్టిక్‌బియ్యం ఉన్నాయంటూ సామాజికమాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని జిల్లా అదనపుకలెక్టర్ లింగ్యానాయక్ స్పష్టంచేశారు. ఈవిషయమై బుధవారం ఒకప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం పంపిణీచేసే సన్నబియ్యం విటమిన్స్‌తో కూడిన సన్నబియ్యం పంపిణీచేస్తున్నామని తెలిపారు. తెలంగాణప్రభుత్వం తెల్లరేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో ప్రజలను ఆందోళనకుగురిచేసే దురుద్దేశంతో కొంతమంది సామాజికమాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గోదావరిఖని, పెద్దపల్లి జిల్లాలోని తిలక్‌నగర్‌లో పంపిణీచేసే సన్నబియ్యంలో ప్లాస్టిక్‌బియ్యం కలిశాయని ఫేస్‌బుక్‌వంటి సామాజిక మాధ్యమాలలో కొన్నివీడియోలు ప్రచారంచేశారని, దీనిపై స్పందించి ఆజిల్లా పౌరసరఫరాలశాఖ తిలక్‌నగర్ ప్రాంతంలో ఎక్కడా ఎటువంటి ప్లాస్టిక్‌బియ్యం సరఫరాలేదని తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిసిందని ఆయన పేర్కొన్నారు. దురుద్దేశంతో సన్నబియ్యం పథకంపై తప్పుడు వీడియోలు సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేసినయెడల సంబంధిత అకౌంట్‌హోల్డర్లపై చట్టరీత్యా కఠినచర్యలు తీసుకుంటామని అదనపుకలెక్టర్ హెచ్చరించారు.

# ప్రధాన రహదారిపై అక్రమ కట్టడాల కూల్చివేత
### -ట్రాఫిక్ సిఐ చొరవతో బోర్డులు తొలగింపు




అక్రమకట్టడాలను కూల్చివేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

**చేవెళ్ల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
చేవెళ్ల ప్రధాన రహదారిపైన గల అక్రమ కట్టడాలను చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని జాతీయ రహదారిని అక్రమించుకుని ఏర్పాటుచేసిన బోర్డులను చేవెళ్ల ట్రాఫిక్ సిఐ వెంకటేశంచొరవతో జెసిబిలతో తొలగించారు. ఈసందర్భంగా చేవెళ్ల ట్రాఫిక్ సిఐ వెంకటేశం మాట్లాడుతూ రోడ్డు పక్కన షాపుల వల్ల వినియోగదారులు వారి వాహనాలను రోడ్డు మీద పార్క్‌చేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్రంగా అంతరాయం ఏర్పడటమేకాకుండా రోడ్డుప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనదారులు తమవాహనాలను రోడ్డుమీద నిలుపకుండా పార్కింగ్‌స్థలంలో నిలపాలన్నారు. రాంగ్‌రూట్‌లో వాహనాలను నడపకూడదన్నారు. దుకాణాల యజమానులు బోర్డులను రోడ్డుకు దగ్గర ఏర్పాటు చేసుకోకూడదన్నారు. చేవెళ్ల రహదారికిరువైపుల రోడ్డును ఆక్రమించిన నిర్మాణాలను తొలిగించారు.

# దాడికి పాల్పడిన ముగ్గురు రిమాండ్



రిమాండ్ చేసిన దాడికి పాల్పడిన నిందితులు

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
కంపెనీలో తోటి ఉద్యోగిపై దాడికి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఘట్‌కేసర్ ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్‌లోని కూలర్ కంపెనీలో పని చేసే రియాజ్ ఉద్దీన్‌కి మరో ముగ్గురు మహమ్మద్ తాబరేజ్, ఇస్లాక్, ప్రకాష్‌రామ్‌కి మధ్య నెలరోజుల క్రితం గొడవజరిగింది. పనిచేసే విషయంలో గొడవకు దారితీయగా ఈనెల 13న రాత్రి 10:30 గంటలకు రియాజ్ ఉద్దీన్ వద్దకు వెళ్లి ముగ్గురు కలిసి ఇనుప రాడుతో దాడిచేశారు. దీంతో రియాజ్ ఉద్దీన్ మెడ ఎముక విరిగి ఆసుపత్రిలో చికిత్స చేసుకున్నాడు. బాధితుడు రియాజ్ ఉద్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టి ముగ్గ్ రు నిందితులు మహమ్మద్ తాబరేజ్, ఇస్లాక్, ప్రకాష్‌రామ్‌లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

# కారు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

**పూడూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
కారు ప్రమాదంలో గాయపడిన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందిన సంఘటన వికారాబాద్ జిల్లా చెన్‌గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి కథనం ప్రకారం వికారాబాద్‌లోని గంగారంగ్రామానికి చెందిన కుర్వ స్వరూప(36) తనకొడుకు అభిలేష్‌తో కలిసి ఈ నెల 10వతేదీ మధ్యాహ్నం సుమారు 1.15గంటలకు మన్నెగూడ విజడమ్ స్కూలు ముందు వికారాబాద్ వెళ్లేందుకు ఆటోను ఆపింది. అదేసమయంలో అతివేగంగా వచ్చిన టిఎస్ ఎపి13ఎబి8199 నెంబరుగల కారు టిఎస్34టిఎ3414 నెంబరుగల్ల ఆటోకు వెనకాలనుండి ఢీకొట్టగా స్వరూప తలకు, శరీర భాగాలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం హైద్రాబాద్‌లోని టిఎక్స్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మగళవారం మృతిచెందింది. మృతురాలు స్వరూప మరిది అవినాష్‌యాదవ్ ఫిర్యాదు మేరకు చెన్‌గోముల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ఆస్తి కోసం తమ్ముడి హత్యకు అక్కాబావల కుట్ర
## -రెక్కీ నిర్వహించిన నలుగురు అరెస్ట్

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
ఆస్తివివాదంతో ఓతమ్ముడిని అంతం చేసేందుకు అక్కాబావలు కుట్ర పన్ని కిరాయిముఠాతో రెక్కీ నిర్వహించిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఈఘటనతో అంకుశాపూర్‌కు చెందిన బాధితుడు బోనాల ఈశ్వర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా నలుగురు కిరాయివ్యక్తులను పోలీసులు అదుపులోకితీసుకొని విచారిస్తున్నారు. ఘట్‌కేసర్ ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..అంకుశాపూర్‌లోని ఈశ్వర్ ఇంటిముందు రెండుబైక్‌లపై నలుగురువ్యక్తులు మాస్కులుధరించి అనుమానాస్పదస్థితిలో తిరుగుతుండగా అటుగా నడుచుకుంటూ వస్తున్న సివిల్ డ్రెస్‌లో ఉన్న కానిస్టేబుల్ చిరంజీవి గమనించి వారిని ప్రశ్నించాడు. దీంతో నలుగురు స్పందించకుండా అనుమానంగా ప్రవర్తించడంతో వారి మొబైల్‌ఫోన్లు తీసుకొని తనిఖీచేయగా బాధితుడు ఈశ్వర్‌కుచెందిన ఇల్లు,కుటుంబం,కారు (టిఎస్08 జివై-8045) ఫోటోలు ఉన్నాయి. ఇది చూసి మెడబోయిన రమేశ్, కొప్పుల మాధవరెడ్డి, బద్దం బుచ్చిరెడ్డి, మణెమ్మలను ఫోటోలకుసంబంధించి ప్రశ్నించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు చేరుకొని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. దీంతో ఆస్తి కోసం ఈశ్వర్‌ను హత్యచేసేందుకు అతని అక్క లావణ్య, బావ శ్రీనివాస్‌లు పన్నినకుట్ర బయటపడింది. టోలిచౌకికి చెందిన బాబాషేక్ సాహిల్(20), ఎండి.ఇర్ఫాన్(20),ఎండి.అబ్బు(18),ఎండి.సల్మాన్(18)లు పోలీసుల అదుపులో ఉన్నారు. తండ్రి పెంటయ్య ఆస్తి కోసం రిటైర్ట్‌మెంట్ అయిన తరవాత వచ్చిన పిఎఫ్ డబ్బులు తమకు కూడా ఇవ్వాలని లావణ్య, శ్రీనివాస్‌లు ఈశ్వర్‌తో తరచుగా గొడవ పడుతుండేవారు. ఈక్రమంలో 2019లో ఈశ్వర్ తన అక్క లావణ్య పేరు మీద ఒక ఎకరం భూమిని రిజిస్ట్రేషన్ చేశాడు. 2020లో లావణ్య, శ్రీనివాస్‌లు ఈశ్వర్ ఇంటికి వచ్చి ఇంకా ఆస్తి ఇవ్వాలని ఒత్తిడి చేయడంతోపాటు కుటుంబసభ్యులను కొట్టడంతో ఈశ్వర్ ఎదురుదాడి చేయగా వారు ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఈశ్వర్‌పై ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేశారు. అప్పటినుంచి ఈశ్వర్ అంకుశాపూర్‌నుంచి వెళ్లిపోయి మేడిపల్లిలో నివాసం ఉంటున్నాడు. దీంతో అతనిపై కక్షపెంచుకున్న అక్కాబావలు కిరాయివ్యక్తులకు డబ్బులిచ్చి పంపించారు. ఈశ్వర్ ఫిర్యాదుతో ఆరుగురిపై కేసునమోదుచేసి నలుగురువ్యక్తులను అరెస్ట్‌చేసి విచారణజరుపుతున్నామని ఎస్ఐ శేఖర్ తెలిపారు.

# మా కాలనీలకు సిసి రోడ్డు వేయాలి

**చేవెళ్ల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
మా కాలనీలకు సిసిరోడ్లను వేయాలని చేవెళ్ల మండల కేంద్రంలోని పలు కాలనీ వాసులు చేవెళ్ల మున్సిపల్ కమీషనర్‌కు బుదవారం వినతి పత్రం అందజేశారు. చేవెళ్ల గ్రామంలోని బాలాజీనగర్, క్రిష్ణారెడ్డినగర్‌లో పలు సమస్యలున్నాయని, డ్రైనేజీ, మిషన్ భగిరథ వాటర్‌పైప్‌లైన్ సక్రమంగా లేదని, వీదిలైట్లు లేక పలు సమస్యలతో సతమతమౌతున్నామని ఫిర్యాదు చేశారు. మాకాలనీల్లోని సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులైన చెన్న కెశవులు,నర్సిం లు,శ్రీనివాస్,సత్యం,తిరుపతి,నర్సి ంలుగౌడ్,శ్రీనివవాస్,మల్లేష్ ,లక్ష్మీకాంత్‌రెడ్డి,అనంద్,నవీన్ వినతిపత్రం అందజేశారు.

## కులమతాలకన్నా మానవత్వమే గొప్పది : ఎమ్మెల్యే శ్రీగణేష్



బోయిన్‌పల్లిలో చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** మానవ సేవయే మాధవ సేవ అనే నినాదంతో యువత ముందుకు వచ్చి పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నేత ముప్పిడి మధుకర్ ఆధ్వర్యంలో గురువారం బోయిన్‌పల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీగణేష్ పౌండేషన్ పేరుతో 15 సంవత్సరాల పాటు చలివేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడంతోనే ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యే అయ్యానన్నారు. మండుటెండలను దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాలలో స్వచ్ఛమైన చల్లని నీరును అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సి.సంతోష్ యాదవ్, భద్రినాథ్ యాదవ్, అరుణ్ యాదవ్, రేపాల వెంకటేశ్వర్లు, సదానంద్, మారుతీ గౌడ్, నాగినేని సరిత తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను వేధింపులకు గురి చేస్తే పోలీసులకు సమాచారం అందించాలి : అడిషనల్ డిసిపి అశోక్




మారేడ్‌పల్లిలో యూనిసెఫ్ ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐ నోముల వెంకటేష్

**కంటోన్మెంట్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** మహిళలను లైంగిక వేధింపులకు గురి చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఉత్తర మండలం అడిషనల్ డిసిపి పగడాల అశోక్ తెలిపారు. యూనిసెఫ్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం బ్లూ అంబ్రెల్లాను పురస్కరించుకొని సికింద్రాబాద్ జెబిఎస్ సమీపంలోని పికెట్ పార్కు నుంచి మారేడ్‌పల్లిలోని డిసిపి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైనర్ బాలబాలికలు లైంగిక వేధింపుకు గురైనట్లైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఫోక్స్ చట్టం కింద కేసు నమోదు చేస్తామన్నారు. మైనర్లపై లైంగిక వేధింపులు జరుగకుండా అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నోముల వెంకటేష్, ఎస్.లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు 2 వేల 18

**మెహిదీపట్నం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు అన్ని కులాల వారికి రాజీవ్ యువ వికాస పథకం ద్వారా రూ.4 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తుండడంతో నిరుద్యోగ యువతీ, యువకులు వేలాదిగా దరఖాస్తులు చేసుకున్నారు. ఈనెల 14వ తేదీ గడువు ముగిసే నాటికి ఆసిఫ్ నగర్ మండల పరిధిలో 2 వేల 18 దరఖాస్తులు రావడం జరిగిందని ఆసిఫ్ నగర్ మండల తహసిల్దార్ జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ 474, ఎస్టి 27, బిసి 901, ఈబీసీ 05, మైనార్టీ 611 దరఖాస్తులు రావడం జరిగిందన్నారు.

## మరకత శ్రీలక్ష్మీ గణపతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆలయంలో బ్రహ్మోత్సవం క్రతువు

**అల్వాల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** అల్వాల్ కానాజీగూడలోని మరకత శ్రీలక్ష్మీ గణపతి నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడు రోజులు పాటు జరిగే ఉత్సవాలు ఆలయ వ్యవస్థాపకులు కార్యనిర్వాహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి పర్యవేక్షణలో జరుగుతాయి. మొదటి రోజు బుధవారం సుప్రభాత సేవ, విశేష అభిషేకం, గోపూజ, కలశస్థాపన, చతురావృత తర్పణాలు, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర స్వస్తి, పుణ్యాహవాచనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట తదితర క్రతువులను పండితులు నిర్వహించారు. గురువారం సుప్రభాత సేవ, విశేష అభిషేకం, స్థాపిత దేవతా పూజలు ప్రధానంగా ఉంటాయి. ఆఖరి రోజు శుక్రవారం భక్తులుచే మహాలింగార్చన, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, పుష్పయాగం, దీక్షకామియోకం, శాంతి కళ్యాణం తదితర కార్యక్రమాలు ఉంటాయని డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి పేర్కొన్నారు. అన్నదానం ట్రస్ట్‌కు భక్తులు విరివిగా విరాళాలు అందించాలని ఆయన కోరారు. పూజా కార్యక్రమాలు అన్న వితరణ పాల్గొనదలిచిన వారు ముందుగా ఆలయ నిర్వాహకులను సంప్రదించాల్సి ఉంటుంది.

## ఆపన్న హస్తం సిఎం సహాయ నిధి

### - పిఎసి చైర్మన్ గాంధీ



లబ్ధిదారులకు చెక్కును పంపిణీ చేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

**కెపిహెచ్బి కాలనీ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** నిరుపేదలకు ఆపన్న హస్తంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఆదుకుంటుందని పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాళి నగర్ కాలనీకి చెందిన మడపతి దివ్యకి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రెండు లక్షల డెబ్బై ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన మంజూరి పత్రాన్ని బాధిత కుటుంబానికి ఆరెకపూడి గాంధీ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా నిలుస్తూ ఆర్థిక భరోసా నిస్తుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీను పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్ని ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదు : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కెపిహెచ్బి కాలనీ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజల్ని ఇబ్బంది పెడితే ఉపేక్షించేదిలేదని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. బుధవారం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంప్ కార్యాలయానికి నియోజకవర్గానికి చెందిన మహిళలు వచ్చి తమ గోడు వెళ్ళబోసుకున్నారు. నియోజకవర్గంలో మంచినీరు అందక చాలా ఇబ్బంది పడుతున్నామని, గత పదేళ్ల కాలంలో మంచినీటికి ఎప్పుడు ఇబ్బంది పడిన దాఖలాలు లేవని వాపోయారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు బిందెలతో ఏ విధంగా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉందో ఇప్పుడు అలాగే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మంచినీరు సరఫరా చేయక పోగా, తామంతా బోర్లు వేసుకుంటే అవి కూడా తీసుకెళ్లిపోయి అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని తాము ఎలా బతకాలని విలపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ప్రజలకు కనీసం మంచినీళ్లు కూడా అందనీయకుండా వారిపై ఈ విధంగా అక్రమంగా కేసులు పెట్టి వేధించడం ఎంతవరకు సమంజసమని, వారికి మంచినీరు ఇవ్వక వారు



ఎమ్మెల్యే మాధవరంకు తమ గోడును వెల్లబోసుకుంటున్న మహిళలు

వేసుకున్న బోర్లను తీసుకెళ్లిపోయి కేసులు పెట్టడం విచారకరమన్నారు. అధికారులు, కిందిస్థాయి సిబ్బంది మాత్రం నీళ్ల ట్యాంకులను బయటకు అమ్ముకుంటారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే పరంపర కొనసాగితే మంచినీటి సరఫరా కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయాల్సిన పరిస్థితి వస్తుందని, తక్షణమే ఇటువంటి చర్యలు ఉపసంహరించుకోవాలని, ప్రజలకు ఏమాత్రం ఇబ్బంది కలిగినా ఊరుకునే ప్రసక్తేలేదని మాధవరం కృష్ణారావు హెచ్చరించారు.

## వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి : హర్షద



మహేంద్రహిల్స్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**అడ్డగుట్ట,ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని యూరో కిడ్స్ ప్రీ స్కూల్ ప్రాంచెస్ ఓనర్స్ బండ్రెడ్డి హర్షద సురేశ్‌లు తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ మహేంద్రహిల్స్ బాలంరాయిలో యూరో కిడ్స్ ప్రీ స్కూల్,స్నేహ డెంటల్ స్కూల్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (డెక్కన్) బ్రాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో డెంటల్ ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు.వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఓనర్స్ ప్రిన్సిపాల్ దివ్య గౌరిశెట్టి, అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ వి.అర్జున్ యాదవ్, డాక్టర్ క్రాంతీ రోగులకు వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

## సికింద్రాబాద్ కోర్టుకు హాజరైన ఎమ్మార్పీఎస్ నేతలు



సికింద్రాబాద్ కోర్టుకు హాజరైన ఎమ్మార్పీఎస్ నేతలు ఇటుక శ్రీ కిషన్ మాదిగ తదితరులు

**కంటోన్మెంట్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణపై అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం వహించిన నిర్లక్ష్యంతో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించినందుకు తోపులాటలో మాదిగ మహిళా అధ్యక్షురాలు భారతి మాదిగ మృతి చెందాడు. దాంతో చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ ఉద్యమ కారులపై అక్రమంగా పెట్టిన కేసులకు హాజరైనట్లు కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ తెలిపారు.

## అనాథ వృద్ధులను ఆదుకోవాలి : సదాకేశవరెడ్డి



మడ్‌పోర్ట్‌లో వృద్ధులకు అన్నదానం చేస్తున్న సదాకేశవరెడ్డి తదితరులు

**కంటోన్మెంట్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** అనాథలు వృద్ధులను హక్కును చేర్చుకొని వారికి సహాయ సహకారాలు అందించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదాకేశవరెడ్డి తెలిపారు. బుధవారం మడ్‌పోర్ట్ లోని వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి : కొంతం దీపిక



జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బందితో సమావేశమై కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

**అడ్డగుట్ట,ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** మోండా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో చెత్తా, చెదారం పేరుకుపోకుండా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు శానిటేషన్ విభాగం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక సూచించారు. బుధవారం ఆమె తాతాచారి కంపౌండ్‌లో శానిటేషన్ సూపర్ వైజర్లు, జవాన్లు,ఎస్.ఎఫ్.ఏ.స్వచ్ఛ్ ఆటో డ్రైవర్స్‌తో సమావేశమై పరిసర ప్రాంతాలను సర్వాంగ సుందరంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో శానిటేషన్ విభాగం అధికారులు ధనా గౌడ్, జహింగీర్, ప్రేమ్, గబ్బార్ పాల్గొన్నారు.

## తులసీ నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు సకాలంలో జరిపించాలి

**యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** తులసీనగర్ సంక్షేమ సంఘం ఎన్నికలను సకాలంలో నిర్వహించాలని స్థానిక బస్తీ వాసులు కోరుతున్నారు. గత 6సంవత్సరాలుగా ఏకగ్రీవంగా సంక్షేమ సంఘం కొనసాగుతూ వస్తుందని ప్రసుత్తం అధ్యక్షుని పదవి కాలం ముగియడంతో తిరిగి కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలను త్వరగా నిర్వహించాలని కోరుతున్నారు. కాలనీ వాసులు అంకిత్ సింగ్, విజయ్‌కుమార్, వెంకటరమణ చారి, కిసన్ సింగ్, కిషోర్ కుమార్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## పౌరాణిక పద్యనాటకాలను పరిరక్షించుకోవాలి

### -సిబిఐ కోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ



కార్యక్రమంలో పాల్గొన్న సిబిఐ కోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ

**చిక్కడపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చలనచిత్ర, నాటకరంగ అభివృద్ధి సంస్థ , కల్పన కళా నికేతన్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి, హనుమాన్ జయంతి సందర్భంగా పద్యనాటకోత్సవం కార్యక్రమం గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో నిర్వాహక సంస్థ అధినేత, రంగస్థల కళాకారుడు దొంతి జంగయ్య గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని "శ్రీకృష్ణ రాయబారం" లో కర్ణ సందేశం పౌరాణిక పద్యనాటకం 'సత్యహరిశ్చంద్రీయమ్" లో కాటి దృశ్య కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. శ్రీకృష్ణుడుగా వేదవ్యాస వెంకటేశు, కర్ణుడుగా దొంతి జంగయ్య గౌడ్, సత్యహరిశ్చంద్రుడుగా జటగొని శ్రీనివాస్ తమ తమ పాత్రలని అద్భుతంగా నిర్వహించారు. సంగీతాన్ని భాస్కర్ రావు అందించగా, ఆహార్యం, మేకప్ పరమేష్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిబిఐ కోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ హాజరై అద్భుతంగా నాటకాన్ని ప్రదర్శించిన కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో బాలబంధు. ప్రముఖ కవి, రసమయి సంస్థ అధ్యక్షులు ఎం కె.రాము, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, ప్రముఖ న్యాయవాది పి. శ్రీనివాసరావు , ప్రముఖ వ్యాపారవేత్త, అయోధ్య రామయ్య గారు పాల్గొన్నారు.

## తెలంగాణలో ప్రముఖ కళ పేరిణినృత్యం

### - ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ



పేరిణినాట్య శిక్షణా శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మామిడిహరికృష్ణ, రంజిత్‌కుమార్ తదితరులు

**రవీంద్రభారతి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** కాకతీయుల కాలంనుండి గొప్ప ఆదరణ, అభిమానాన్ని చూరగొన్న, శరీరాన్ని గగుర్పొల్పే నృత్యవిన్యాస కళ పేరిణి నృత్యమని తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ అన్నారు. రవీంద్రభారతి ప్రాంగణంలోని కళాభవన్‌లో తన కార్యాలయంలో బుధవారం ఈ నెల 24నుండి తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ సంయుక్తంగా 45రోజులపాటు ఉచితంగా నిర్వహించబడే పేరిణినాట్య గురుశిష్య పరంపర-2 వేసవి శిక్షణాశిబిరం పోస్టర్‌ను హరికృష్ణ పేరిణి నాట్యాచార్యుడు రంజిత్‌కుమార్, నవ్యజ, శ్రవణ్‌రాజు, లోహిత్, గురుదేవ్, వైష్ణవి, తేజస్విని తదితరులతో కలిసి ఆవిష్కరించి ప్రసంగించారు. పేరిణికి ప్రాణంపోసిన వృత్తరత్నవళి రచయిత జయపసేనాని ఈ కళను నేటితరానికి అందించారని తెలిపారు. రామప్ప దేవాలయ శిల్పభంగిమలు నేటికీ పేరిణి నాట్యశిల్పాలుగా సాక్షాత్కరిస్తున్నాయని, పద్మశ్రీ నటరాజ రామకృష్ణ సంవత్సరాల పరిశోధనల కృషిఫలితమే పేరిణినాట్యం ఆవిష్కరించబడిందని హరికృష్ణ వివరించారు. ఈ శిక్షణాశిబిరంలో పేరిణినాట్యంలో నూతన అంశాల రూపకల్పన, కొత్త కళాకారులకు తాళాలపై అవగాహన, కూర్పు తదితర అంశాల బోధన ఉంటుందన్నారు. ఇందులో ఔత్సాహిక యువకులు, విద్యార్థులు పాల్గొని పేరిణినృత్యాన్ని నేర్చుకొని భావితరాలకు అందించాలని కోరారు.

## రాందేవ్ ఆసుపత్రికి ఆదరణ ఫౌండేషన్ ఎక్సలెన్స్ అవార్డు ప్రధానం...

**కెపిహెచ్బి కాలనీ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ఆదరణ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 22వ వార్షికోత్సవ సందర్భంగా ఎక్సలెన్స్ అవార్డ్స్‌లో భాగంగా రాందేవ్‌రావ్ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కె. కమలాకర్‌ని ఈ సంవత్సరం ఎక్సలెన్స్ అవార్డును ఆదరణ ఫౌండేషన్ వారు ప్రకటించారు. ఈ అవార్డు కొరకు వ్యవస్థపాక అధ్యక్షులు రఘునాథ్ బాబు, రేఖీ థెరపీ గ్రాండ్ మాస్టర్ లక్ష్మి కమలాకర్‌ని, ఆసుపత్రి సీనియర్ మేనేజర్ కల్పనని ఈ అవార్డు ను ప్రధానం చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. అత్యంత అనుభవం కలిగిన వైద్య రంగంలో 50 సంవత్స రాల అనుభవం కలిగిన, దేశ రక్షణలో 30 సంవత్స రాల తమ జీవితాలను త్యాగం చేసిన కమలాకర్, ఆర్మీ నుండి రిటైర్ అయ్యాక రాందేవ్‌రావ్ చారిటబుల్ ఆసుపత్రి అభివృద్ధిలో తన అనుభవన్ని రంగరించి, రాందేవ్‌రావ్ ఆసుపత్రిని మరింత ముందుకు తీసుకెళ్లడంలో, తద్వారా సమాజాన్ని సేవ చెయడంలో ముందుంటారు.నిరాడంబరుడు, వినయశీలి అత్యంత క్రమశిక్షణ కలిగిన,ఆదర్శవంతమైన నాయకున్ని సత్కరించుకోవడం ఆదరణ ఫౌండేషన్ భాగ్యంగా భావిస్తుందని నిర్వాహకులు తెలియజేశారు.

## సంస్కృతి సంప్రదాయాలే తరగని సంపద : దైవజ్ఞశర్మ

**నాంపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ప్రతీఒక్కరూ మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలను కాపాడుకోవాలని, అవే మనకు ఎన్నటికీ తరగని జాతిసంపదని ప్రఖ్యాత సంఖ్యాశాస్త్ర నిపుణుడు, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ ఉద్బోధించారు. ఉజ్వల సంస్థ రాష్ట్ర రాజధానితోపాటు దేశరాజధాని ఢిల్లీలో కూడా వివిధ ప్రముఖ సాంస్కృతిక, సంప్రదాయ కళాప్రదర్శనలు నిర్వహిస్తూ ఆయారంగాల్లోని వారిని ప్రోత్సహించడం హర్షదాయకమని, మున్ముందు జాతీయస్థాయిలో వివిధ రాష్ట్రాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని సంస్థకు, నిర్వాహకుడు సతీష్‌కు శుభాశీస్సులందజేశారు. ప్రముఖ సాంస్కృతిక సామాజిక స్వచ్ఛంద సేవాసంస్థ ఉజ్వల ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎస్ డివోషనల్ గ్రూప్ సహకారంతో సీనియర్ పాత్రికేయుడు ఎన్.సత్యనారాయణ యాదవ్ (సతీష్) నేతృత్వంలో వివిధరంగాల్లో విశేషసేవలందించిన ప్రముఖులకు ఉజ్వల ఉగాది నంది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దైవజ్ఞశర్మ విశిష్ట అతిథులు కేరళ జ్యోతిష్యనిపుణుడు శివనరసింహన్ తాంత్రి, పారిశ్రామి




ఉజ్వల ఉగాదినంది పురస్కారంతో సేవామూర్తులను సత్కరిస్తున్న దైవజ్ఞశర్మ, శివనరసింహన్, పార్థసారథిరెడ్డి, లక్ష్మి తదితర అతిథులు

కవేత్తలు పార్థసారథిరెడ్డి, బాలరాజ్‌గౌడ్, గురుస్వామి రాజు, వసంతరాయులు, శ్రీలత, సంస్థ అధ్యక్షురాలు ఎం.లక్ష్మి తదితరులతో కలిసి ఆయారంగాల్లో అద్వితీయ సేవలందిస్తున్న సేవామూర్తులను ఘనంగా సత్కరించి ఉజ్వల ఉగాదినంది పురస్కారాలను ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు.

## ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో నష్టపోతున్న వారికి న్యాయం చేస్తాం : ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ ప్రాంతంలో చేపడుతున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో నష్ట పోతున్న మజీద్, దర్గాలకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడంతో పాటు తగిన న్యాయం చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. బుధవారం బోయిన్‌పల్లి చౌరస్తాలోని దర్గా వద్ద ముస్లిం మైనార్టీలు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ట్రాఫిక్‌కు క్రమబద్ధీకరించేందుకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో నష్టపోతున్న ఇండ్ల స్థలాల యజమానులకు మజీద్,దర్గాలు, గ్రేవ్ యార్డ్‌లకు నష్టం జరుగకుండా తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కారిడార్ నిర్మాణంలో ప్రైవేట్ స్థలాలతో పాటు ప్రార్ధన స్థలాలు కూడా నష్టపోతున్నాయని ఆయన తెలిపారు. హైదరాబాద్ జిలా కలెక్టర్ హెచ్ఎండిఏ, రెవెన్యూ, ఉన్నతాధికారులతో చర్చించి ముస్లిం



బోయిన్‌పల్లి దర్గాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

మైనార్టీలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం బోర్డు అధ్యక్షుడు అజ్మత్ హుస్సెన్, సిరాజ్, షకీబ్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, సీనియర్ కాంగ్రెస్ నేత ముప్పిడి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## శతవసంత కుసుమాచరం ఆచార్య బిరుదురాజు రామరాజు

### -తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు

**నాంపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** పల్లెపదాల్లో పామరజనాల్లో ఫరిడవిల్లిన సమాజ సంస్కృతుల్లోని మహత్వాన్ని దాక్షిణాత్యభాషల్లోనే ప్రప్రథమంగా వెలుగులోకి తెచ్చిన క్రాంతదక్షులు, శతవసంత కుసుమాచరం ఆచార్య బిరుదురాజు రామరాజు అని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందారావు ప్రస్తుతించారు. సాహిత్య అకాడమీ, శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం సంయుక్తంగా నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో భాషానిలయం గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు సభాధ్యక్షతన నిర్వహించిన బిరుదురాజు రామరాజు శతజయంతి-సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన నిత్యానందరావు ప్రసంగిస్తూ జానపదాన్ని అందలం ఎక్కించి అక్షరాభిషేకం చేసిన అమృతమూర్తని, జానపదం జ్ఞానపదమంటూ వివిధ విశ్వవిద్యాలయాల్లో విశిష్ట పరిశోధనా విభాగంగా విరాజిల్లుతూ మూడు నాలుగు వందలకుపైగా పరిశోధనలు గ్రంథాలు వెలువడడానికి చూపిన దోవ రాజమార్గమన్నారు. ఎక్కడో మూలుగుతున్న ప్రాచీన సంస్కృతాంధ్ర కావ్యాలను ఎన్నింటినో సేకరించి వెలుగులోకి తెచ్చిన పరిశోధకకర్తని కొనియాడారు. అలాగే ఎన్నో అపూర్వగ్రంథాలను తొట్టతొలిసారిగా లోకానికి పరిచయం చేశారని, మరుగుపడిన మాణిక్యాలను చరికెక్కిన చరితార్థులుగా మార్చగలిగిన పరుశవేధితనం ఆశ్చర్యదాయకమని తెలిపారు. ఆయన కాంగ్రెస్ కార్యకర్తగా ఉద్యమాల్లో చూపిన తెరువ, కనబరిచిన ఆసక్తి, సమాజ గనమానపట్ల వారికున్న అవగాహనకు దర్పణమని వివరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగుశాఖ అధ్యక్షుడుగా, అధ్యాపకుడుగా, ఆచార్యుడుగా చూపిన దీక్షాదక్షత



బిరుదురాజు రామరాజు సారస్వత వ్యాసములు ఆవిష్కరిస్తున్న నిత్యానందరావు, మృణాళిని, ఉదయవర్లు తదితర అతిథులు

లు, కాకతీయ విశ్వవిద్యాలయ ఆవిర్భావంలో రూపురేఖలు తీర్చిదిద్దిన ఆయన సామర్థ్యం, దూరదృష్టి నేటికీ ఆదర్శప్రాయం, అనితరసాధ్యమని స్పష్టం చేశారు. ఎవరినీ యాచించని ఆత్మాభిమానం, నిలబెట్టుకున్న ఆత్మగౌరవం అభినందనీయం, అపూర్వాంశమన్నారు. అఖిలభారతస్థాయిలో జాతీయ పరిశోధనాచార్యులుగా రామరాజు పొందిన అరుదైన గౌరవం తెలుగునాట అద్వితీయం, నిరుపమానమని పేర్కొన్నారు. బిరుదురాజు రామరాజు లెక్కకుమిక్కిలిగా పొందిన సన్మానాలు, సత్కారాలు, పురస్కారాలు జీవితంలో పండించుకున్న ఉన్నతత్వానికి, సాధించుకున్న ఉత్తమమత్వానికి ఎత్తిన విజయకేతనమని విశదీకరించారు. అనంతరం సాహిత్య అకాడమీ తెలుగుసలహా మండలి సంచాలకురాలు సి.మృణాళిని స్వాగతోపన్యాసం కావించగా అమ్మంగి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బిరుదురాజు రామరాజు సారస్వత వ్యాసములను ఆవిష్కరించారు. తదపరి రెండు సమావేశాల్లో సదస్సు నిర్వహించగా సాయంత్రం ముగింపు సమావేశంలో బిరుదురాజు రామరాజు శతజయంతి స్మారక సంచిక నివాళిని ఆవిష్కరించారు.

## సంపన్నుల ఆస్తులను జాతీయం చేయాలి : ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి లెనిన్ బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** దేశంలోని వనరులను యదేచ్ఛగా దోచుకుంటున్న సంపన్నులు ముకేష్ అంబానీ, ఆదానీ ఇతర బడా వ్యాపారస్తుల ఆస్తులను జాతీయం చేయాలని,యువతను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై నిరంతరం ఉద్యమించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ కార్యదర్శి లెనిన్ బాబు పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కన్వెన్షన్ హిమాయత్ నగర్ లోని సత్యనారాయణ రెడ్డి భవన్ లో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి లెనిన్ బాబు మాట్లాడుతూ కార్పొరేట్ సంపన్నులు దేశాన్ని అన్ని రకాలుగా దోచుకుని తమ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుచుకుంటున్నారని, కానీ దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి లో మాత్రం వారి పాత్ర సూన్యమని ఆరోపించారు. ఆర్థిక స్థిరత్వం అంటే దేశ అభివృద్ధి అని, కానీ కార్పొరేట్ శక్తుల నినాదం మాత్రం తమ వ్యాపార సామ్రాజ్యాల ఎదుగుదలే ప్రధాన ధ్యేయమని వారు ఉద్ఘాటించారు. కార్పొరేట్ శక్తుల విధానాల కారణంగా ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి బహుళజాతి కంపెనీలకు రెడ్ కార్పెట్ వేసిన పాలకుల తీరు సిగ్గుచేటని, దీ ఏ దేశానికి లేనంత యువ సంపద మనకున్నప్పటికీ ఉత్తేజం, ఉత్సాహం కరువయ్యాయన్నారు. పాలకుల వినాశకర విద్యా




సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి లెనిన్ బాబు

విధానాల కారణంగా దేశంలోని 30శాతం మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అకాశాలు లేవన్నారు. రాష్ట్ర విభజన హామీలకు దిక్కులేదని,బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదన్నారు. అవినీతి, దోపిడీలకు ఆస్కారం లేని సమాజం యువత ఆకాంక్ష అని చెప్పారు. ఇది యువతతోనే సాధ్యమన్నారు.ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు,లింగం రవి,బిజ్జ శ్రీనివాసులు, యుగంధర్,పేరబోయిన మహేందర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్. బాలకృష్ణ, సల్మాన్ బేగ్,షేక్ మహమూద్,శివ కుమార్,మధు,బోనగిరి మహేందర్, మస్కు సుధీర్, మోగిలి లక్ష్మణ్, మహేష్, మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, మానస్ కుమార్,మార్కపూరి సూర్య, రాజేష్, మధు, ప్రవీణ్, అశోక్, రాజ్ కుమార్,వెంకటేష్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

**యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికపుడు బస్తీల కాలనీలలో పాదయాత్రలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి తగిన విధంగా కృషి చేయడం జరుగుతుందని అల్లాపూర్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీనగర్ డి బ్లాక్‌లో రూ.15లక్షల వ్యయంతో నూతనంగా సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తెత్తకుండా మౌళిక వసతుల కల్పనలో తామెప్పుడు ముందుంటామని తెలిపారు. వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా అధికారులు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్‌పెక్టర్ వినాయకరావు, డిబ్లాక్ అధ్యక్షులు అస్లామ్, మహ్మద్ రఫీ, జనీల్, దావుద్, ఇస్మాయిల్, జావేద్, తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ గాంధీ నగర్‌లో సీసీరోడ్డు పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్.

### గాయత్రినగర్‌లో కార్యకర్తల సమావేశం

బీఆర్ఎస్ పార్టీ చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గాను ఈనెల 17వతేదీ గురువారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రినగర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యలయం వద్ద కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసున్నట్లు డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు లింగాల ఆయిలయ్య తెలిపారు. ఈ సమావేశానికి డివిజన్ కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్ నియోజక వర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎమ్‌డి గౌసుద్దీన్ పాల్గొంటారని అన్ని బస్తీల కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు, అనుబంద కమిటి సభ్యులు, వార్డు సభ్యులు, ఏరియా సభ సభ్యులు, సీనియర్ నాయకులు, మహిళలు, పిలుపునిచ్చారు. ఉదయం 9గంటలకు ఈ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

## సోనియా రాహుల్ గాంధీలపై బిజెపి ప్రభుత్వ కక్షపూరిత చర్యలు

**నాంపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** నేషనల్ హెరాల్డ్ విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కక్షపూరితంగా ఏఐసీసి అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల పేర్లను ఛార్జిషీట్‌లో చేర్చడాన్ని తీవ్రంగా నిరసిస్తూ, ఖండిస్తూ మాజీ ఎంపి వి.హనుమంతరావు ఆధ్వర్యంలో బుధవారం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం వద్ద పెద్దయెత్తున ధర్నా నిర్వహించారు. దేశంలో పేదప్రజలు, రైతులు, నిరుద్యోగుల గురించి పోరాడే వారిపై బిజెపి కేసులు పెడుతోందని ధ్వజమెత్తారు. ఇటువంటి దుశ్చర్యలకు భయపడతామనేది అవివేకమని, వెంటనే ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. టిపిసిసి ఆధ్వర్యంలో రేపు గురువారం ఈడీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ప్రకటించినప్పటికీ వి.హనుమంతరావు మాత్రం ఈరోజే ఈడీ కార్యాలయానికి చేరుకొని ధర్నా నిర్వహించడం విశేషం.

## బార్ అసోసియేషన్ సభ్యుల ప్రమాణ స్వీకారం

**షాద్‌నగర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** షాద్‌నగర్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. బార్ అసోసియేషన్ హాలులో నూతన అధ్యక్షుడిగా వేణుగోపాల్ నర్వ, ఉపాధ్యక్షుడిగా చీపిరి చంద్రశేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గుండుబావి శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా అంతారం నర్సింలు, లైబ్రేరియన్ సెక్రెటరీగా బొమ్మగళ్ల రమేష్, కోశాధికారిగా ఎల్.లింగం గౌడ్, మహిళా సెక్రెటరీ జయమ్మ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీగా రహీముద్దిన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పబ్బె శ్రీశైలం, రేవెల్లి విజయ్ కుమార్ గౌడ్, విజయ్ భాస్కర్, బేరి శ్రీనివాస్, పాత్లావత్ రూపసింగ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ బాడీ నూతన కమిటీకి బాధ్యతలను అప్పగించారు. ఈసందర్భంగా నూతన ప్రెసిడెంట్ వేణుగోపాల్ నర్వ మాట్లాడుతూ బార్ అసోసియేషన్‌కు సీనియర్ న్యాయ వాదుల సహాయ సహకారాలు ఉండాలని, అలాగే ఇప్పటి వరకు ఉన్న కమిటీ ప్రెసిడెంట్ రాజశేఖర్ రాజు, కమిటీ బాగా పనిచేసిందని, అలాగే నూతన కమిటీ సభ్యులు కూడా బాగా పని చేస్తామని, మాటల్లో కాకుండా చేతల్లో చేస్తామని అన్నారు. సీనియర్, జూనియర్ న్యాయవాదులకు అందుబాటులో ఉంటూ వారికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఏవైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే కమిటీ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని అన్నారు.

## పుట్టినబిడ్డకు ఆరునెలలవరకు తల్లిపాలు ఇవ్వాలి

**-ఐసిడిఎస్ సుపర్‌వైజార్ ధనలక్ష్మి**



గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సుపర్‌వైజార్ ధనలక్ష్మి

**కోట్‌పల్లి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** పుట్టినబిడ్డకు ఆరునెలలవరకు తల్లిపాలు ఇవ్వాలని ఐసీడీఎస్ సుపర్‌వైజార్ ధనలక్ష్మి, అన్నారు. బుధవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించారు. ఈసందర్బంగా అమె మాట్లాడుతూ. గర్భం ధరించిన రోజు నుండి బిడ్డకు రెండు సంవత్సరాలు నిండే వరకు గడిచే దశ చాలా ముఖ్యమైనదన్నారు. ఈ దశలో ముఖ్యంగా బిడ్డ బరువు, ఎత్తు, అత్యంత వేగంగా పెరుగుతారన్నారు. 80,శాతం మెదడు అభివృద్ధి చెందుతుందన్నారు. రోగా నిరోధక శక్తి కుడా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని బిడ్డకు 6, నెలల వరకు పూర్తిగా తల్లిపాలు కొనసాగిస్తూ అదనపు ఆహారం మొదలు పెట్టాలన్నారు. బిడ్డకు సమయానూసారంగా వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలని అమె పేర్కొన్నారు, ఈకార్యక్రమంలో ఏఎన్‌యం అపర్ణ, అంగాన్‌వాడీ కార్యకర్తలు సుహసిని, జ్యోతి, గర్భిణీ బాలెంతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి పశువులకు గాలికుంటు టీకాలు

**షాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** షాబాద్‌మండలంలో గురువారంనుంచి పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేస్తున్నట్లు షాబాద్ పశువైద్యాధికారి స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17నుండి వచ్చేనెల 10వరకు మూడు వైద్య బృందాలు అన్ని గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 17 నుండి 18 వరకు కుమ్మరిగూడ, కక్కులూరు, మాచనపల్లి, 19న అంతిరెడ్డి గూడ, తండాలు, 21న నరెడ్లగూడ, నాగర్ కుంట, 22న షాబాద్, కురువగూడ, 23న దైవాలగూడ, 24న పటేల్ గూడ, బోనగిరి పల్లి, సర్దార్ నగర్, 25న సంకేపల్లి గూడ, శేరిగూడ, అంతారం, 26న కేశవ గూడ, 28న ముద్దెంగూడ, కేసారం, దామర్లపల్లి, 29న మల్లారెడ్డి గూడ, కేసారం తాండ, 30న అప్పరెడ్డిగూడ, సాయిరెడ్డి గూడ, వచ్చేనెలనుండి 2న లింగారెడ్డి గూడ, ఎల్గొండ గూడ, 3న ఆస్పల్లి గూడ, బోడంపాడ్, 4న మరియాపూర్, మన్మర్రి, పెదవేడు, 5న గోపిగడ్డ, పెదవేడు తండాలు, 6న చర్లగూడ, పోలారం, 7న పోలారం తాండలు, 8,9,10న మండలంలో మిగిలిన పశువులను గుర్తించి గాలికుంటు నివారణ టీకాలు వేసున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సంఘటన సంరచనా సమావేశం..

**వికారాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** బిజెపి జిల్లా అధ్యక్షుడు కొప్పుల రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అమ్మల్యాబ్ సమావేశంహాలులో సంఘటన సంరచనా సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా సంఘటన సంరచనా ప్రభారి పడాకుల శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు. మండల స్థాయిలో కమిటీలు, గ్రామకమిటీల ు ఈనెల20వతేదీవరకు పూర్తిచేయాలని తెలిపారు. మండలాలలో బీజేపీ కోసం పనిచేసే వారు ముందుకు వచ్చి మండల కమిటీలో బాధ్యతలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు సదానందరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శులు విజయ భాస్కర్‌రెడ్డి,రామచందర్,నాయకులు నవీన్,జి.శివరాజు,వికారాబాద్ అసెంబ్లీ, పరిగిఅసెంబ్లీ, తాండూరుఅసెంబ్లీ మండలఅధ్యక్షులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న టిఎన్‌జిఓస్ అధ్యక్షులు, జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ బి.రవిప్రకాశ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం రాత్రి తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ మేడ్చల్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. దీనిలో తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి)ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మేడ్చల్ జిల్లా జెఎసి చైర్మన్‌గా బి.రవిప్రకాశ్, సెక్రటరీ జనరల్‌గా జి.వినోద్‌కుమార్‌లను మరి కొందరు కార్యవర్గంను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులపై పెరుగుతున్న ఒత్తిళ్లు, వాగ్దానాల అమలులోజాప్యం, ఆర్థికసమస్యలు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు కలిసి జిల్లా జెఏసి కమిటీని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏర్పాటు చేసుకోవటం జరిగిందన్నారు. ఉద్యోగ సంఘాలు జేఏసి కింద ఉద్యోగుల హక్కులను, ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు ఈకమిటీని ఏర్పాటుచేసినట్లు వివరించారు. ఉద్యోగసంఘాలు ప్రభుత్వంపై పోరాటాలకు సిద్దంకావటానికి రాష్ట్రవ్యాప్తంగ అన్నిజిల్లాల్లో జెఏసి కమిటీలు ఏర్పాటుచేసుకోవటంజరుగుతుందని దీనిలోభాగంగానే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో కూడ ఉద్యోగ సంఘాల జెఏసి కమిటీని ఏర్పాటు చేసుకోవటం జరిగిందన్నారు.

## గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

**ధూళిమిట్ట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** మండలంలోని జాలపల్లి గ్రామం లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి,మాజీ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా సుమారు నలభై తొమ్మిది లక్షలతో సీసీ రోడ్డు, పాఠశాల ప్రహరీ గోడ పూర్తిచేశామన్నారు. నేడు ఇరవై ఐదు లక్షల నిధులో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని మరో సారి రుజువు చేయడం జరిగిందన్నారు.

## జైబాపు,జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం

**శామీర్‌పేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దెమర్రి గ్రామంలో గురువారం ఉదయం, తూంకుంట మున్సిపాల్టీ కేంద్రంలో సాయంత్రం జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏఐసిసి,టిపిసిసి ఆదేశాల మేరకు జైబాపు,జైభీమ్,జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని ఎంసిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు,మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, తూంకుంట మున్సిపల్‌కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్ రెడ్డిలు పేర్కొన్నారు. ఉద్దెమర్రిలో ఉదయం 8గంటలకు, తూంకుంటలో సాయంత్రం 5గంటలకు కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ, మండల, గ్రామాల నాయకులు,పార్టీ శ్రేణులు పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, డిసిసి అధ్యక్షులు ఎస్.హరివర్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్‌లు,మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డిలు పాల్గొనటం జరుగుతుంది. ఉద్దెమర్రి, తూంకుంట గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

## సంస్కృతం భవిషత్ తరాలకు అత్యంత అవసరం

**-సాక్రిఫైస్ సంస్థ చైర్మన్ డాక్టర్ మల్లిఖార్జునరావు**



విలేకరులతో మాట్లాడుతున్న సాక్రిఫైస్‌సంస్థ చైర్మన్ డా.మల్లిఖార్జునరావు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** సంస్కృతం భవిషత్ తరాలకు అత్యంత అవసరమని, పూర్వం నుంచి ఉన్న సంస్కృత భాషలో రాణించటం వల్ల జీవనశైలి, నైతికత, ఆత్మవిశ్వాసం పెంచే శక్తిగా నిలుస్తుందని దీనికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందని సాక్రిఫైస్ సంస్థ చైర్మన్ డాక్టర్ మల్లిఖార్జునరావు అన్నారు. ఉచితంగ సంస్కృతంను మూడు నెలలపాటు రెసిడెన్షియల్ తరహాలో శిబిరంలో శిక్షణ ఇచ్చి పాఠశాలల్లో సంస్కృతంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. బుధవారం మేడ్చల్ జిల్లాలోని వాల్మీకి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన జిల్లా విలేకరుల సమావేశంలో సాక్రిఫైస్ సంస్థ చైర్మన్ డాక్టర్ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ సంస్కృతం ప్రాధాన్యతను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సంస్కృతంలో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించటం ద్వారా యువత భవిషత్‌ను తీర్చిదిద్దే మార్గంను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. సోషల్ అండ్ కల్చరల్ రీసర్చ్ ఇనుస్ట్యూషన్ ఫర్ ఇంటర్ కాంటినెంటల్ ఎక్చేంజ్ (సాక్రిఫైస్) మూడు నెలల పాటు ఉచితంగ శిక్షణ శిబిరం నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ పూర్తిగా గురుకుల విధానంలో ఉచితంగ అందించనున్నట్లు ఆయన వివరించారు. సంస్కృతంలో చదవటం,రాయటం, మాట్లాడటం వంటి నైపుణ్యాలు నేర్పించటం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి నెలకు 15వేల రూపాయల వేతనంతో ఉద్యోగం అవకాశం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు రిజిష్ట్రేషన్ నమోదుకు చివరి గడువు అని, శిక్షణా కార్యక్రమం ఈ నెల 28వ తేదీన ప్రారంభం అవుతుందని, శిక్షణా కేంద్రానికి ఏప్రిల్ 27వతేదీ సాయంత్రం లోపు చేరుకోవాలన్నారు. సంస్కృతం భాషలో రాణించటానికి సంస్కృతంను విస్తరించటానికి శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించటానికి సంస్థ కృషి చేస్తుందన్నారు. సంస్కృత భాషకు పూర్వ వైభవం తీసుకరావటానికి సంస్థ దానిపై శిక్షణ ఇవ్వటానికి, శిక్షణ పొందిన వారికి ఉపాధి కల్పించటానికి కూడ సంస్థ కృషి చేస్తుందని చైర్మన్ డాక్టర్ మల్లిఖార్జునరావు పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట-తిమ్మాయిపల్లి గ్రామాల మధ్యలో గల వాల్మీకి ఆశ్రమంలో శిబిరాలు నిర్వహించటం జరుగుతుందని ఆయన వివరించారు. వివరాలకు ఫోన్‌నెంబర్లు 9299709290, 8919456452 గల వాటిలో సంప్రదించవచ్చని ఆయన వివరించారు.

## పునశ్చరణ శిక్షణా కార్యక్రమం

**-పాల్గొన్న రాష్ట్ర సహకార సంఘాల కమిషనర్ కె.సురేంద్రమోహన్**



శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన కె.సురేంద్రమోహన్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని సహకార సంఘాల చైర్మన్లకు, సిఇఓలకు, సిబ్బందికి ప్రభుత్వ లక్ష్యాలను, సదుపాయాలను రైతులకు అందించటానికి వారికి పునశ్చరణ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా (మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలు)లోని రైతు ఉత్పత్తిదారుల సంఘాల (సంస్థల) ఎఫ్‌పిఓల చైర్మన్లకు, సిఇఓలకు, సహకార సిబ్బందికి ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని రాష్ట్ర సహకార సంఘాల కమిషనర్ కె.సురేంద్రమోహన్ విచ్చేసి జ్యోతిప్రజ్వలనచేసి ప్రారంభించారు. భారత దేశంలో 10వేల రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయాలని కేంద్రం సంకల్పించింది. దీనిలో భాగంగ 2023-2024సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలో 32జిల్లాల్లో 311 ప్రాథమిక సహకార సంఘాలు, రైతు సేవాసహకార సంఘాలను ఎఫ్‌పిఓలుగా గుర్తించటం జరిగిందన్నారు. ఎఫ్‌పిఓల నిర్వాహణ గురించి అవగాహన కల్పించటానికి ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా డిసిఓ వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా డిసిఓ సుదాకర్, వికారాబాద్ జిల్లా డిసిఓ కె.నాగార్జున, , తెలంగాణ యూనియన్ ప్రిన్సిపల్ వెంకన్న, తెలంగాణ కోఆపరేటివ్ యూనియన్ ఫ్యాకల్టీ ఎస్.ధాత్రిదేవి, సంగీత, సురేఖరాణి, అనితతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిఎంఎస్ వైస్‌చైర్మన్,శామీర్‌పేట సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, మూడు జిల్లాలకు చెందిన 36సంఘాల చైర్మన్లు, సిఇఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలందరూ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

**-ప్రముఖ క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ సి.ఎన్ శ్రీకాంత్**



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సి.ఎన్.శ్రీకాంత్

**వికారాబాద్‌జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ప్రజలందరూ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని, శరీరంలో వచ్చే మార్పుల ు అశ్రద్ధ చేయవద్దని ప్రముఖ క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ సి.ఎన్ శ్రీకాంత్ అన్నారు. తాండూరుపట్టణంలోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్లో ఐఎంఏ తాండూరు, యువజాగృతి ఆధ్వర్యంలో కాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో హైద్రాబాద్ యశోద హాస్పిటల్ ప్రముఖ కాన్సర్ నిపుణులు డాక్టర్ సి.ఎన్ శ్రీకాంత్ మాట్లాడుతూ, మన దేశంలో కాన్సర్ వేగంగా ప్రబలుతుందని ముఖ్యంగా మన అనారోగ్యజీవనశైలి, దురలవాట్లు కాన్సర్‌కు దారితీస్తున్నాయని అన్నారు. పొగాకు,గుట్కా వాడకం కాలుష్యం,కల్తీ ఆహార పదార్థాలు, వంశ పారంపర్యంగా కాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రారంభ దశల్లోనే గుర్తించడం ద్వారా కాన్సర్ కు చికిత్స అందించి నయం చేయవచ్చు అని వెల్లడించారు. కీమోథెరపీ,రేడియోథెరపీ, ఇతర పద్ధతుల చికిత్స అందించవచ్చు అని అన్నారు. కార్యక్రమంలో యువజాగృతి సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

**సిద్దిపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** అధికారంలో ఉన్నామన్నా అహంకారంతో కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం నాయకులపై మోది ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు ప్పాడుతుందని ఆపార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్, బొమ్మల యాదగిరి అన్నారు. బుధవారం పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా లో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై ఈడి కోర్టులో చార్జీషీట్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో దగ్ధం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ సేవకే తమ ప్రాణాలను లెక్కచేయని కుటుంబాన్ని మోది ప్రభుత్వం మానసికంగా వేదిస్తుందన్నారు. అధికారం దుర్వినియోగం చేస్తున్న మోది ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు త్వరలో వస్తాయన్నారు.ఇప్పటికైన అక్రమంగా దాఖాలు చేసిన ఛార్జీషీట్‌ను వెంటనె వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ముద్దం లక్ష్మి,మదు, దాస అంజయ్య, ఎల్లం, సతీష్, సంతోషి, రషద్ గయాజుద్దీన్, వహాబ్, అనిల్, కవిత, మున్నా, హర్సద్, అజ్మత్, రేణుక, రజిని సన కనకయ్య, షాదుల్లా, కొంచెం కనకరాజు, రాజిరెడ్డి, ఖాన్, బాలయ్య తదితరులు ఉన్నారు.

## ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు కాంగ్రెస్‌ను వదిలేదిలేదు

**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

**ధూళిమిట్ట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే దాకా ప్రభుత్వంతో కొట్లాడుతానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తోర్నాల గ్రామంలో ఇజీఎస్ నిధులతో వచ్చిన నాలుగు లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులను నాయకులతో కలిసి ప్రారంభిం చారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు.

**బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు...**

కాంగ్రెస్ పార్టీ తోర్నాల గ్రామ అధ్యక్షుడు తుషాలాపురం బాలయ్యతో పాటు పలువురు నాయకులు ఎమ్మెల్యే పల్లా సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ చేరారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు.అనంతరం బాలయ్య మాట్లాడుతూ నిరంతరం నియోజకవర్గ ప్రజల కొరకు పోరాడుతూ అనేక కార్యక్రమాలు,సేవలు చేస్తున్న ఎమ్మెల్యేను చూసి ఆకర్షితుడనై బీఆర్ఎస్‌లో చేరానని తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ తన హాస్పిటల్‌కు నియోజకవర్గంనుండి వచ్చిన ప్రతి ఒక్కరికి పైసా ఖర్చు లేకుండా నెలకు సుమారు ఐదువేల మంది వరకు వైద్యం సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి బద్దిపడగ కృష్ణారెడ్డి,మంద యాదగిరి, గోనెపల్లి మల్లేశం, మాజీ సర్పంచ్ తాళ్ళపల్లి రాజమ్మ, మాజీ ఎంపిటీసి ఆకుల యాదగిరి, నాగిళ్ళ తిరుపతిరెడ్డి, తాళ్ళపల్లి బిక్షపతి, నాచగోని వెంకట్‌గౌడ్, చొప్పరి సాగర్‌ముదిరాజ్, పాల్గొన్నారు.

## 13 ఎల్ కాల్వను రీ డిజైనింగ్ చేయండి

**హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** పట్టణంలోని డబుల్ బెడ్‌రూంల నుండి వెళ్తున 13 ఎల్ కాల్వపనులను నిలిపివేయడంతో పాటు రీడిజైనింగ్‌లో వేరే ప్రాంతం నుండి కాల్వ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ కాల్వలో భూములు కోల్పోతున్న బాదితులు బుధవారం రోజున హుస్నాబాద్ తహసీల్దార్‌తో పాటు ఇరిగేషన్ ఈఈ లకు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ 13 ఎల్ కాల్వ ప్రస్తుతం వెళ్తున్న దారిలో నిరుపేద కుటుంబాలకు చెందిన రైతులు ఉన్నారని వారికి ఉన్న 1గుంట,2 గుంటల భూమిని కోల్పోతున్నారన్నారు.ఈ విషయంలో సంబందిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా కనికరం చూపించడం లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వరకె ఆభూమి కోర్టు కేసులో ఉందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బాదితులు మహేశ్వర్‌రెడ్డి, రాజిరెడ్డి, జాల జ్యోతికుమార్, జాల లక్ష్మయ్య, పోలోజు శ్రీనివాస్, బూరుగు కిష్టస్వామి, నవీన్ తదితరులు ఉన్నారు.

## యువతి వివాహానికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

**ధూళిమిట్ట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** మండలంలోని జాలపల్లి గ్రామానికి చెందిన నర్మెట సారయ్య బతుకు దెరువు కోసం గల్ఫ్ దేశం వెళ్లి సంవత్సరం క్రితం అక్కడే మరణించగా అప్పటి నుండి వారి భార్య తన ఇద్దరు కూతుళ్లను కూలీ పనులకు వెళ్లి చదివించుకుంటుంది.అయితే ఇటీవల తన పెద్ద కూతురికి వివాహం కుదరగా సారయ్య భార్య పెళ్లి చేసేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతుందనే విషయాన్ని బుధవారం ఆ గ్రామ తాజామాజీ సర్పంచ్ వరలక్ష్మీసాగర్‌లు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు వివరించారు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సారయ్య కూతరు వివాహానికి తన వంతు సహాయంగా రూ 10వేల ఆర్థిక సహాయం అందించి మంచి మనసు చాటుకున్నారు.సారయ్య కూతరు వివాహానికి ఎమ్మెల్యే విరాళం అందిచడం పట్ల గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లిఖార్జునరెడ్డి**

**అక్కన్నపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** అకాల వర్షానికి వరిపంట నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అయిలేని మల్లిఖార్జునరెడ్డి డిమాండ్ చేశారు.బుధవారం మండలంలో కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతుల పొలాలను, కొనుగోలు కేంద్రాలను పార్టీశ్రేణులతో కలసి పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో రైతులు నష్టపోతే కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ ప్రాంతం నుండి ఎమ్మెల్యేగా గెలిసి మంత్రి అయిన పొన్నం ప్రభాకర్ అందుబాటులో ఉండకపోవడంవల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంట నష్టపోయిన రైతుల విషయంలో మంత్రి వెంటనే స్పందించి వారికి నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాకాల శ్యాంసుందర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఎల్ఓసి చెక్కు అందజేత

**సిద్దిపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన దేశెట్టి కలవ్వకు ఆనారోగ్య ఖర్చుల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు బుధవారం రూ.2లక్షల యాభైవేల రూపాయల చెక్కును అందజేశారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండాలి

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 16,ప్రభాతవార్త :** ప్రజలు అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండడంతోపాటు ప్రమాదం జరిగినప్పుడు ఎలా తప్పించుకోవాలి, ప్రాణ, ఆస్థి నష్టాలను ఎలా తగ్గించాలనే అంశాలపై అవగాహన కలిగి ఉండాలని హుస్నాబాద్ ఫైర్‌స్టేషన్ ఇంచార్జీ పరమేశ్వర్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని సురక్ష, శ్రీనివాస్, వెంకటేశ్వర ఆసుపత్రులలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి సిబ్బంది వివరించారు. ఆసుపత్రులలో అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయాలలో తప్పించుకునేందుకు లిఫ్టులు,ఎలక్ట్రికల్ వస్తూలను వాడకూడదని,ఆసుపత్రులలో ఉండే ఫైర్ మిషన్ల ద్వార మంటలు ఆర్పే విధానాన్ని వివరించారు.ప్రమాదాలు సంబవించిన వెంటనే 101 నంబర్‌కు సంప్రదించి వారి సహాయం పొందాలన్నారు.

## గోటి తలంబ్రాలు అందజేసిన ప్రిన్సిపాల్

**గజ్వేల్, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త):** గజ్వేల్‌లో ఈనెల 22న జరిగే శ్రీ సీతారామ ఉమామహేశ్వరుల కళ్యాణానికి గత సంవత్సరం అందించిన విధంగానే ఈ సంవత్సరం కూడా గోటి తలంబ్రాల కార్యక్రమం శ్రీ రామకోటి భక్త సమాజం సంస్థ శ్రీకారం చుట్టింది. బుధవారం సరస్వతి శిశుమందిర్ విద్యాలయంలో గోటి తలంబ్రాలను సరస్వతి శిశుమందిర్ ప్రిన్సిపాల్ హరినాపవన్ రామరాజుకు అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రామనామ స్మరణ చేస్తూ గోటితో వడ్లను ఒలిచి తలంబ్రాలుగా తయారుచేసి రామకోటి రామరాజుకు అందజేసినట్లు తెలిపారు. గజ్వేల్‌లో జరిగే శ్రీ సీతారామ ఉమామహేశ్వరుల కళ్యాణానికి గోటి తలంబ్రాలు అందించడం మహా భాగ్యమన్నారు. ఈ కార్యక్రమంలో శిశుమందిర్ ఉపాధ్యాయురాలు గుండు గాయత్రి, రజిత, భవాని, అక్షర, ప్రణయ, లావణ్య, అంజలి తదితరులు పాల్గొన్నారు.

## వాసవిమాత చలివేంద్రం

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త):**

పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద ఇటీవల ప్రారంభించిన వాసవిమాత చలివేంద్రం బుధవారం డాక్టర్ లింగం సౌజన్యంతో మజ్జిగ పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయమని, వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడం కోసం వాసవిమాత చలివేంద్రం ఏర్పాటుచేసిన ఆర్యవైశ్య నాయకులను అభినందిం చారు. అచలివేంద్రం వద్ద ప్రతి బుధవారం మజ్జిగ, అంబలి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

## మెడిసిటీ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

**గజ్వేల్, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త):** పట్టణంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి ఆధ్వర్యంలో మెడిసిటి ఆసుపత్రి వైద్యులు మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌తో పాటు పలు ప్రాంతాలకు చెందిన వెయ్యి మందికి పైగా రోగులు వైద్య సేవలు పొందారు. మొదటగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షరెడ్డి వైద్య శిబిరాన్ని సందర్శించి మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు 10 లక్షల వరకు వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సాహితి, డాక్టర్ అనిమీష, డాక్టర్ అమూల్య, డాక్టర్ రిషిత, డాక్టర్ హర్ష, డాక్టర్ సంతోష్, డాక్టర్ దీక్షిత, డాక్టర్ అఖిలేష్, డాక్టర్ డేనియల్, డాక్టర్ నవ్య, డాక్టర్ డింపుల్‌లు పాల్గొని గుండె, చెవి, ముక్కు, గొంతు, కీళ్ల నొప్పులు, చర్మ, దంత, నరాలు, సాధారణ తదితర వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా మైనార్టీసెల్ మాజీ అధ్యక్షుడు సమీర్, నాయకులు జంగం రమేష్‌గౌడ్, సుఖేందర్‌రెడ్డి, నంగు నూరి సత్యనారాయణ, గుంటుకు శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, యాదగిరి, ఏఎంసి డైరెక్టర్లు డాక్టర్ వాహిద్, అక్కారం యాదగిరి, అజ్గర్, అంజద్, బాబురావు, అజార్, జగ్గయ్యగారి శేఖర్‌గుప్త, సురేష్, గణేష్ పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి భరోసా సిఎంఆర్ఎఫ్ :ఎమ్మెల్యే

**నర్సాపూర్ రూరల్, ఏప్రిల్ 16,ప్రభాతవార్త:** కాజీపేట గ్రామానికి చెందిన శీలమంతుల యాదమ్మ కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ముఖ్య మంత్రి సహాయ నిధి కి దరఖాస్తు చేసుకోగా వారికి మంజూరైన ..25,500/ ఇరవై ఐదువేల ఐదువందల రూపాయల చెక్కును ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి హైదరాబాద్ మాదాపూర్ లోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్బంగా సునితారెడ్డి మాట్లాడుతూ ఆర్థిక స్థితి గతులు బాగాలేక వైద్యం చేయించుకునే స్థోమత లేక అనేక మంది అప్పులు చేసి ఇబ్బందుల పాలవుతున్నారు. వారికి సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిగారి సుధాకర్‌రెడ్డి, శీలమంతుల నాగేష్, యాద ́గిరి, పల్లె వీరేష్, మచ్చురి రమేష్, నజీర్, బోయిని అశోక్, సిమ్మల్, కొట్టాల రమేష్, తమ్మలి వేణు, తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

మనూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: మండల పరిధిలోని మాయికోడ్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ గ్రామ కమిటి అధ్యక్షులు చంద్రకాంత్ కుమార్తె వివాహానికి మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు మండల బిఆర్ఎస్ అధ్యక్షులు విఠల్‌రావుఉ పాటిల్, నాయకులు, మాజీ సర్పంచ్‌లు పరమేష్, సంగప్ప, సంజీవులు పాల్గొన్నారు.

## అనాథ పిల్లలకు అండగా ఉంటాం

**-అనాథల వివారాలు సేకరించిన డిడబ్ల్యూఓ, డిసిపిఓ**

**పావన్నపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కుర్తివాడలో అనాధలుగా ఉన్న పిల్లలకు అండగా ఉంటామని డిడబ్ల్యుఓ హైమవతి, డిసిపిఓ కరుణశీల అన్నారు. బుధవారం గ్రామంలోని అనాథ పిల్లల పూరిగుడిసె లను పరిశీలించి వారి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా అధికారులు హైమవతి, కరుణశీలలు మాట్లాడుతూ గ్రామానికి చెందిన భూతిపురం రవి గతంలో ప్రమాదావశాస్తు మరణించాడని, మృతుడి ఇద్దరు కుమార్తెలు, కొడుకులను పోషించే స్థోమత లేక తల్లి సంపూర్ణ సంతానాన్ని వదిలేసి వెళ్లి పోవడంతో ముగ్గురు అనాథలుగా మారిపోవడంతో ఇద్దరు అమ్మాయిలను బం ధువులు, కుమారుడిని వసతి గృహంలో ఉంటున్నాడని, వేసవి సెలవును పురస్కరించి స్వగ్రామానికి వచ్చి పూరిగెడిసెలో ఉండే పరిస్థితి లేకపోవడంతో విషయాన్ని తెలుసుకుని గ్రామానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారని సిడిపిఓ సూపర్‌వైజర్‌లు తెలిపారు.

## మహిళా హక్కుల పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలి : ఐద్వా జిల్లా కార్యదర్శి శారద

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** మహాత్మ జ్యోతిరావుపూలే, బిఆర్ అంబేద్కర్ యాదిలో జరిగే మహిళా హక్కుల పరిరక్షణకోసం జరుగుతున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర (ఐద్వా) జిల్లా కార్యదర్శి అత్తిని శారద పిలుపునిచ్చారు.బుధవారం రోజున సంఘం సమావేశం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 14న మహిళా హక్కుల పరిరక్షణ యాత్ర ప్రారంభమైందని అన్నారు. ప్రారంభమైన ఈ యాత్ర 20వ తేదీ వరకు నిర్వహిస్తుండగా ఈనెల 18వ తేదీన సిద్దిపేట జిల్లాకు చేరుకుంటుందని 19న సిద్దిపేటలోని పాత బస్టాండ్ వద్ద పూలే,అంబేద్కర్‌లకు నివాళి అర్పించి మహిళలకు ఉన్న హక్కుల గురించి రాజ్యాంగంలో వారికి కల్పించిన అవకాశాలను గురించి అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. కార్యక్రమం లో జిల్లా కమిటీ సభ్యులు విగ్నేశ్వరి, నర్సవ్వ, లావణ్య, కవిత,ధరణి ఉన్నారు.

## బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం

**ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలమంలో బుధవారం బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. కేసీఆర్ బహిరంగ సభ సమయ సందర్భాన్ని ఎమ్మెల్యే వివరించారు.బహిరంగ సభకు ఒక రోజు ముందు ప్రతి వార్డులో జెండా ఆవిష్కరణ చేసుకోవాలని అన్నారు. కేసీఆర్ బహిరంగ సభతో దేశ రాజకీయాల్లో చర్చ జరుగుతుందని అన్నారు. సమావేశంలో టిఆర్ఎస్ నాయకులు కాసాల బుచ్చిరెడ్డి,నరహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పన్నులో 5శాతం రిబేట్‌ను వినియోగించుకోవాలి

**-మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య**

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త):** 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 5 శాతం రిబేట్‌ను మున్సిపల్ ప్రజలు వినియోగించుకోవాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సెంట్ జోసెఫ్ పాఠశాల వారు 5 శాతం రిబేట్‌లో ఒక లక్ష 67,430 రూపాయల పన్ను చెల్లించడం జరిగింది. ఈ కార్యక్రమం లో రెవెన్యూ ఆర్ఓ, ఆర్ఐ, బిల్ కలెక్టర్, వార్డు ఆఫీసర్ పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన పల్లా

**ధూళిమిట్ట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** మండలంలోని లింగాపూర్ గ్రామం లో బిఆర్ఎస్‌పార్టీ కార్యకర్త తాటికొండ శేఖర్‌రెడ్డి అమ్మమ్మ మెదిని వెంకటవ్వ, జాలపల్లి గ్రామంలో గ్రామ బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు నాగులపల్లి సంపత్ తండ్రి రామయ్య,ముస్తఫా నానమ్మ చాంద్ బిలు ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి బుధవారం బాధిత కుటుంబాలను ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారా కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 16,ప్రభాతవార్త:** రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. బుధవారం చిన్నశంకరంపేటలో, గవ్వలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రైతులు మద్య దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం క్రయ విక్రయాలు జరపాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తెలిపారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలన్నారు. రైతులు ధాన్యాన్ని తేమ శాతం 17 ఉండేలా చూసుకోవాలన్నారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాలుకు2320, సాధారణ రకానికి రూ.2300 చెల్లిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సహకర సంఘం చైర్మన్లు అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సాన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రామదేవత ఊరడమ్మ ఉత్సవాలు



గ్రామదేవత పూజలో పాల్గొన్న గ్రామస్థులు

**నవాబుపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మీనపల్లికలాన్‌లో నిర్వహిస్తున్న గ్రామదేవత ఊరడమ్మ ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈనెల 11నుండి ఉత్సవాలు ప్రారంభమైయ్యాయి. 11న శుక్రవారం బోడ్రాయి త్రిష్టాపన, అఖండ దీపారాధన, గంగాసేకరణ, గోపూజ, ఆలయప్రవేశం, మహాగణపతి పూజ, తదితర కార్యక్రమాలు, 12న సుప్రభాతసేవ, ప్రతిష్ఠమూర్తుల అభిషేకం, అవాహిత మంటపదేవత పూజలు, 13న వృషభలగ్నమున యంత్ర ప్రతిష్ఠ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం, తదితర రార్యక్రమాలు, 14న ఆయా గ్రామాల భక్తులచేత భజన కార్యక్రమాలు. 15న బోనాలు, బుధవారం జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గం ఇంచార్జీ భీంభరత్ తదితర నాయకులు పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. ఆసాంతం అంగరంగ వైభవంగా కార్యక్రమాలు నిర్వహించారు. బోనాల ఊరేగింపు ప్రధాన వీధుల గుండా సాగింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మానిక్‌రెడ్డి, పెంటయ్య, మాజీ ఎంపిటీసి వెంకట్‌రెడ్డి, నాయకులు సంగమేశ్వర్, సురేష్‌గౌడ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## పేదల భూములు అమ్ముకున్నారు




యాత్రలోపాల్గొన్న నాగారం కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి

**కీసర, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
పేదలు భూములను బిఆర్ఎస్ నేతలు అమ్ముకున్నారని నాగారం మున్సిపల్‌కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. బుధవారం నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి ఓల్డ్ విలేజ్‌లో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పట్ల బిజెపి నాయకులు విమర్శించడంతో కాంగ్రెస్‌పార్టీ అధినేత రాహుల్‌గాంధీ, ఏఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే పిలుపు మేరకు దేశం మెత్తం గ్రామగ్రామాన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ యాత్రలను చేపట్టి బిజెపి నాయకులు చేసిన విమర్శలను ఖండిస్తున్నట్లు తెలిపారు. అందులోభాగంగానే నాగారం మున్సిపాలిటీలో యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ చేసిన అక్రమాలనుచూసి ప్రజలు కాంగ్రెస్‌పార్టీని ఎన్నుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన ప్రభుత్వమని, ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని అందులో భాగంగానే కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీమేరకు ఉచిత బస్సుప్రయాణం, ఉచిత కరెంటు, సిలిండర్ సబ్సిడీ, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లోల కుమార్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డాక్యుమెంట్ రైటర్ల నిరసన దీక్ష



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంముందు నిరసనదీక్షచేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

**కీసర, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రిజిస్ట్రేషన్ పద్ధతిని మార్చి స్లాట్ బుకింగ్ పద్ధతిని ప్రవేశపెడుతున్న నేపధ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 144 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలలో పనిచేస్తున్న దాదాపు 30వేలమంది డాక్యుమెంట్ రైటర్ల కుటుంబాలు రోడ్డున పడతాయని ఈ స్లాట్‌బుకింగ్ పద్ధతిని ఉపసంహరించుకోవాలని బుధవారం కీసర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ముందు డాక్యుమెంట్ రైటర్లు ప్లకార్డులు పట్టుకుని ధర్నాకుదిగారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డాక్యుమెంట్ రైటర్లు 30సంవత్సరాలనుంచి డాక్యుమెంట్లు చేసుకుంటూ బతుకుతున్నామని మాపొట్టకొట్టవద్దని లైసెన్స్ సిస్టం ఏర్పాటుచేసి లైసెన్సులు ఇచ్చి డాక్యుమెంట్‌చేయాలని ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. లేనిచో డాక్యుమెంట్ రైటర్లు గత ప్రభుత్వంలో చేసినట్టే మహాధర్నాకు దిగి మాహక్కులని సాధించుకుంటామని రాష్ట్రప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఈర్లపల్లి మహిళాసంఘం గ్రామకమిటీ ఎన్నిక

**-అధ్యక్షురాలిగా సరిత ఎన్నిక**



మహిళాసంఘం నూతన కార్యవర్గంను సన్మానిస్తున్న నాయకులు

**దుద్యాల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామంలో మహిళా సంఘం గ్రామ కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈర్లపల్లి, నాణ్యా నాయక్ తాండ, సంత్ర కుంట తండాలకు సంబంధించిన 27 స్వయం సహాయక సంఘాలకు చెందిన ముఖ్య సభ్యులు పాల్గొని కమిటీని ఎ న్నుకున్నారు. అధ్యక్షురాలిగా సరిత, కార్యదర్శిగా పద్మమ్మ, కోశాధికారిగా వీజీబాయిల ఎ ఏకగ్రీవంగా ఎ న్నుకున్నారు. ఈసందర్భంగా అధ్యక్షురాలు సరిత మాట్లాడుతూ మహిళాసంఘాలలో ఎలాంటి అవకతవకలులేకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహిళాసంఘాల సిసి రామచంద్రయ్య, బిఓఏ మల్కప్ప, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి జర్నలిస్టుల శుభాకాంక్షలు

**షాద్‌నగర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
షాద్‌నగర్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వేణుగోపాలరావుకు షాద్‌నగర్ జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక దేవిగ్రాండ్ హోటల్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆయనను కలుసుకున్న జర్నలిస్టులు ఈసందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో సీనియర్ జర్నలిస్టులు కెపి, కస్తూరి రంగనాథ్, రాఘవేందర్ గౌడ్, శేఖర్‌రెడ్డి, నరేష్, నరసింహ్మారెడ్డి, సిఈవో సీనయ్య, అడ్వకేట్ ఎ.అంజయ్య, తదితరులు ఉన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

**-విభజించి పాలించడమే బిజెపి నైజం..**



జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**కొత్తూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అనే నినాదంతో రాజ్యాంగ పరిరక్షణకోసం కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు కొత్తూర్ మండలంలోని మక్తగూడ, గూడూర్, మల్లాపూర్‌లో బుధవారం జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి ముప్పుతెచ్చేవిధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు రిజర్వేషన్లకు ముప్పు వాటిల్లేవిధంగా ఉన్నాయని తెలిపారు. పెద్ద పెద్ద కుబేరుల నుండి నల్లధనం వెలికి తీస్తామని హామీ ఇచ్చి బిజెపి మాట నిలుపుకోలేదని, వారికి నల్లధనాన్ని వైట్‌మనీగా చేసుకునే ఛాన్స్ ఇచ్చారన్నారు. అలాగే జన్‌ధన్ బ్యాంకుఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి నయాపైసా వేయలేదని అన్నారు. కులాలు, మతాల మధ్య విభేదాలు సృష్టించి పబ్బం గడుపుకోవడమే బిజెపి విధానమన్నారు. కోట్లలో ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రధాని మోడీ ఈదిశగా కనీసం ఆలోచనలు కూడా చేయడంలేదన్నారు. గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్‌పార్టీ ఉపాధిహామీ పథకాన్ని తీసుకువచ్చి ఎంతోమంది పేదల కడుపులు నింపుతుందన్నారు. రాష్ట్రంలో నిధులకొరత ఉన్నప్పటికీ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ఘనత సిఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ, స్వతంత్ర్యం వచ్చినప్పటినుండి ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యదేశంగా పేరుగాంచిన భారతదేశంలో రాజ్యాంగాన్ని మార్చేందుకు కేంద్రం కుట్రలు పన్నుతుందని విమర్శించారు. కేంద్రం కుట్రలను ప్రజలకు వివరించి చెప్పేందుకు వారిని చైతన్యవంతులుగా చేసేందుకు ఏఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ గ్రామగ్రామాన పాదయాత్ర చేపట్టాలని నిర్దేశించారన్నారు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ ఇదేనినాదంతో పాదయాత్ర చేపట్టారన్నారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపిపి శివశంకర్‌గౌడ్, బాబర్ అలీఖాన్, విశ్వం, రఘునాయక్, హరినాథ్‌రెడ్డి, జె.సుదర్శన్‌గౌడ్, దయానంద్‌గుప్తా, రాందాస్ నాయక్, మల్లేష్, శ్రీరామ్, రాజు, అంబటి ప్రభాకర్, చిల్కమర్రి నరసింహ, కొమ్ము కృష్ణ, కుమారస్వామి, చంద్రపాల్‌రెడ్డి, కె.సురేందర్, మోడీ దర్శన్, పార్టీ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## దళితవాడలో బిజెపినేతల సహపంక్తి భోజనం



గుండ్లపోచంపల్లిలో సహపంక్తి భోజనం చేస్తున్న బిజెపి నాయకులు

**మేడ్చల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
దేశప్రజలకు స్వేచ్ఛ, సమానత్వకల్పన కోసం జీవితాన్ని త్యాగంచేసిన మహానుభావుడు బిఆర్ అంబేద్కర్ అని బిజెపి జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్ అన్నారు. అంబేద్కర్ జయంతి వారోత్సవాల్లో భాగంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో గావ్ చలో బూత్ చలో కార్యక్రమం నిర్వహించి 40వ బూత్ బిజెపి అధ్యక్షుడు మహేష్ ఇంట్లో మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు కావేరి శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సంహపంక్తి భోజనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమన్యాయం ఉండాలని తన జీవితాన్ని అంకితం చేసిన ప్రపంచ మేధావి అంబేద్కర్ అని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవడమే ఆయనకు మనమందించే నీరాజనమని అన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకుడు విక్రంరెడ్డి, మోహన్‌రెడ్డి, కృష్ణాగౌడ్, మాజీ కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, సరస్వతి, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్‌ముదిరాజ్, నాయకులు అర్జున్‌బాబు, నవనీత, కవిత, నవీన్, గణేష్‌రెడ్డి, శాంతన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆహారపు అలవాటర్లపై జాగ్రత్తలు తీసుకోండి

**-ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జోత్స్న**



ఆహారపు అలవాట్లపై ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ జోత్స్న

**కొందుర్గు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిశోర బాలికలు సంపూర్ణ ఆరోగ్యం కోసం ఆహారపు అలవాట్ల గురించి జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జోత్స్న సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్షంలోభాగంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లలకు, కిశోర బాలికలకు ఆహారపు అలవాటర్లపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో పాల్గొని విధిగా పప్పుధాన్యాలు, ఆకుకూరలు, చిరుధాన్యాలను ఆహారంతో పాటు విధిగా తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రజియా బేగం, ఆయ నవనీత, మహిళలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన దాసోజు శ్రవణ్

**-శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి**

**షాద్‌నగర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన దాసోజు శ్రవణ్ కుమార్‌ను కలుసుకొని శుభాకాంక్షలు తెలిపినట్లు మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం శాసనమండలిలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి దాసోజు శ్రావణ్‌కుమార్‌తో ప్రమాణ స్వీకారం చేయించారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావులు ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారంచేసిన దాసోజు శ్రవణ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపినట్లు నవీన్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఎస్సీ మహిళల అభివృద్ధికి ప్రభుత్వం చేయూత

**-కొడంగల్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తిరుపతిరెడ్డి**



కుట్టుమిషన్లు అందజేస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి తిరుపతిరెడ్డి

**దుద్యాల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
షెడ్యూల్డ్‌కులాల మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతగానో తోడ్పడుతుందని కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జ్ ఎ నుముల తిరుపతి రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్ఫూర్తి రూరల్ డెవలప్మెంట్ సొసైటీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో 3నెలలపాటు శిక్షణ పూర్తిచేసుకున్న 35మంది ఎస్సీ మహిళలకు కుట్టుమిషన్లతోపాటు శిక్షణ సర్టిఫికెట్ ను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పేదప్రజల సంక్షేమంకోసం ఎంతగానో కృషి చేస్తుందని, ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రత్యేక పథకాలు రూపొందిస్తుందన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 30మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఉపతహసీల్దార్ వీరేష్‌బాబు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసెస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి, కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, వైస్‌చైర్మన్ ఆకారం వేణుగోపాల్, దుద్యాల్ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు అవుటి శేఖర్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య, నాయకులు సీతారాంనాయక్, శ్రీశైలంగౌడ్, ఖాజ, కృష్ణ, సత్యనారాయణ, లస్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నమ్ముకున్న సిద్ధాంతాన్ని వదులుకోవద్దు

**-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



ఉత్తమ జర్నలిస్టు అవార్డుగ్రహీతలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
మనం చేస్తున్నవృత్తిలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా నమ్ముకున్న సిద్ధాంతాలను వదులుకోకూడదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ చేతుల మీదుగా ఉత్తమ జర్నలిస్టులుగా అవార్డులు అందుకున్న జర్నలిస్టులు ఎం.డి.ఖాజాపాష (కెపి), మిద్దుల సత్యనారాయణలను ఎమ్మెల్యే శంకర్ సన్మానించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌పార్టీ శ్రేణులతోకలిసి శాలువాలతోసన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేస్తున్న జర్నలిస్టు వృత్తిలో ఎన్నో అవాంతరాలు ఎదురవుతాయని, గతంలో జర్నలిస్టులకు సంబంధించిన ఎన్నో ఇబ్బందులను స్వయంగా చూశానని గుర్తుచేశారు. అనంతరం జర్నలిస్టు శంకర్ జర్నలిస్టు కెపిపై, ఎమ్మెల్యే శంకర్‌లపై రూపొందించిన రెండు పాటలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, పట్టణ పార్టీ అధ్యక్షుడు చెన్నయ్య, రఘునాయక్, మైనార్టీనేత ఇబ్రహీం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజుగౌడ్, మాజీ ఎంపీటీసీ భార్గవ్‌కుమార్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్, జాంగారి రవి, ఉస్మాన్, తుపాకుల శేఖర్, రాయికల్ శ్రీనివాస్, అనిల్‌కుమార్, ముబారక్ ఖాన్, చిన్న, సయ్యద్‌ఖదీర్, రంగాపూర్ మహేందర్, పెంటయ్య, హుస్సేన్ పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో ఆర్ఎంపిలను నియంత్రించండి

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి క్వాలిఫైడ్ డాక్టర్ల వినతి**



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న షాద్‌నగర్ వైద్యులు

**షాద్‌నగర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
షాద్‌నగర్ పట్టణంలోని ఆర్ఎంపీలకు సంబంధించి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పలు అంశాలను వైద్య ఆరోగ్యశాఖ దృష్టికి తీసుకొచ్చారు. బుధవారం రంగారెడ్డిజిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావును కలుసుకొని లిఖితపూర్వకంగా వినతిపత్రాన్ని అందజేశారు. షాద్‌నగర్‌లో అర్హతలేని వ్యక్తులను ప్రాక్టీస్ చేయకూడదని వైద్యశాఖ అధికారికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా ప్రధానంగా గ్రామీణవైద్య ఆరోగ్య సలహాదారులు (ఆర్ఎంపీలు) గ్రామానికి మాత్రమే పరిమితం చేయాలని, వారు ఆయాహాస్పిటల్స్ పేర్లతో బోర్డులను ప్రదర్శించకూడదని కోరారు. క్లినిక్, హాస్పిటల్, వైద్యశాల, ఆరోగ్య సంరక్షణ కేంద్రం, దవాఖాన వంటి పేర్లు ఎట్టిపరిస్థితుల్లోవాడకూడదని, పట్టణంలో ఆర్ఎంపీ వ్యవస్థలేదని, గ్రామీణప్రాంతంలో నోనేమ్ బోర్డులు ప్రథమచికిత్స మాత్రమే చేయాలని, ఆర్ఎంపీల అభ్యర్థనపై ల్యాబ్స్‌లో దర్యాప్తు చేయకుండా ప్రైవేటు ల్యాబ్‌లను నియంత్రించడం, మెడికల్ షాపులు చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మకూడదన్న ప్రభుత్వ నిబంధనలను తుచ తప్పకుండా పాటించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రభుత్వనిబంధనలకులోబడి పనిచేసేలా చర్యలు తీసుకుంటామని, ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే తగినచర్యలు తీసుకొంటామని ఆయన సూచించినట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ నాగర్జున్‌రెడ్డి తెలిపారు.

## యంనంపేట్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాదయాత్ర




పాదయాత్రలో మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
పోచారం మున్సిపల్ యంనంపేట్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్. శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మెట్టు గణేశ్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ చేపట్టిన పథకాలను ప్రజలకు వివరిస్తూ పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి దేవాలయ కమిటీ చైర్మన్ నర్రి శ్రీశైలం కురుమ, కాంగ్రెస్ మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఏర్ర రాజు, మున్సిపల్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఏర్ర మాధవి, యూత్ కాంగ్రెస్ నాయకులు మల్లిఖార్జున్‌రెడ్డి, సహదేవ్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, ఎం. శ్రీరాములు, మాజీ ఉపసర్పంచ్ దర్శన్‌యాదవ్, ప్రభాకర్‌గౌడ్, ఆనంద్ గౌడ్, బద్దం నర్సింహారెడ్డి, బాస్కర్‌రెడ్డి, నరేందర్, నక్క లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



తండావాసులు రిలే నిరాహారదీక్ష చేస్తున్న దృశ్యం

**శంకర్‌పల్లి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
తమభూములు తిరిగి ఇప్పించాలని డిమాండ్‌చేస్తూ కొండకల్ తండావాసులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా బుధవారం 96వ రోజు దీక్షల్లో పలువురు గిరిజనులు కూర్చొని మాట్లాడారు. గత మూడునెలలుగా ఎండ, వాన, చలిని లెక్క చేయకుండా దీక్షలు చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. నిరుపేదలకు అండగా ఉండాల్సిన అధికారులు కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుతూ తమ భూములను కట్టబెట్టారని, న్యాయం చేసేవరకు పోరాటం కొనసాగుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి తమ భూములు తిరిగి ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

## చర్చి నిర్మాణానికి ఆర్థికం సాయం

**కోట్‌పల్లి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
పెద్దెముల్ మండల పరిధిలోని మారేపల్లి గ్రామంలో నూతన నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి సాయం చేయాలని బుధవారం నాడు కోట్‌పల్లి మండల పరిధిలోని కరీంపూర్ గ్రామంలో కోట్‌పల్లి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సుందరి అనిల్ నివాసంలో కలువగా తనవంతుగా రూ.11వేలు ఆర్థికసాయంచేశారు. దీంతో మారేపల్లి గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్, వెంకటయ్య, ఎన్,సుదర్శన్, ఎన్,అశోక్, డి,బాలు, చంటి, తదితరులు పాల్గొన్నారు.

## వివాహవేడుకలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

**షాద్‌నగర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
రాయికల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి కుమార్తె వివాహం షాద్‌నగర్ పట్టణంలోని కుంట్ల రాంరెడ్డి కన్వెన్షన్‌హాల్‌లో జరపగా షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, అన్నారం మాజీ సర్పంచ్ రాములుగౌడ్ తదితరులు ఉన్నారు.

## దేవాలయం అభివృద్ధికి సంపూర్ణ సహకారం

**-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



నూతన ఆలయకమిటీ చైర్మెన్, కమిటీసభ్యులతో ఎమ్మెల్యే శంకర్

**కొత్తూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
స్వయంభు శ్రీఅనంతపద్మనాభస్వామి దేవాలయ అభివృద్ధి కోసం నియమితమైన దేవాదాయశాఖ ఈవో శ్రీరామశర్మ, ఇన్స్‌స్పెక్టర్ కె.మోహన్‌రెడ్డి ప్రమాణ శ్రీకారం చేయించారు. ఈప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు. దేవాలయ కమిటీ చైర్మెన్‌గా ఎన్నికైన బెజవాడ అనితారెడ్డి, కమిటీ సభ్యులుగా కె.రమేష్, పి.శంకర్‌యాదవ్, పద్మారెడ్డి, డి.రమేష్‌లు బాధ్యతలు స్వీకరించారు. వీరిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డిలు ఘనంగా సత్కరించి పూలబొకేతో ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, అగ్గనూర్ విశ్వం, రఘునాయక్, బాబర్‌అలీఖాన్, బాలరాజుగౌడ్, హరినాథ్‌రెడ్డి, జె.సుదర్శన్‌గౌడ్, జాంగారి రవి, నర్సింలు, చంద్రపాల్‌రెడ్డి, అంబటి ప్రభాకర్, కొమ్ము కృష్ణ, సురేందర్, దేశాల భీమయ్య, అశోక్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న గిద్దె రాజేష

**దోమ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**
స్థానికసంస్థల ఎన్నికలతోపాటు అసంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన అన్నిహామీలను నెరవేర్చాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణసమితి రాష్ట్రఅధ్యక్షులు గిద్దె రాజేష్ డిమాండ్‌చేశారు. బుధవారం దోమ మండలం కొత్తపల్లి గ్రామంలో వికలాంగులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లి నుంచి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ వరకు వందలాదిమంది వికలాంగులతో పాదయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమములో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లురి ఇదయ్యబాబు, వికారాబాద్‌జిల్లా అధ్యక్షులు పోతురాజు సుదీర్, యువ జనవిభాగం నాయకులు గుంటిశివకుమార్, పర్గిమండల అధ్యక్షులు చంద్రయ్య, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.